# క్రైమ్ మిర్రర్®

Voice of Anti Corruption

హైదరాబాద్
4-4-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక:17

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

## కాంగ్రెస్‌తో సిపిఐ కటీఫ్!

### పంచాయితీ ఎన్నికల్లో స్నేహపూర్వక పోటీ

మున్సిపల్ ఎన్నికలకు వచ్చేసరికి ప్రత్యర్థులుగా తలపడి

లి కాంగ్రెస్ వైఖరి పై సిపిఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు ఆగ్రహం




**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** కాంగ్రెస్ పార్టీతో కటీఫ్ చెప్పేందుకు సిపిఐ సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో

2లో

## కువైట్ చమురుశుద్ధి కర్మాగారంపై దాడి

### డ్రోన్లతో విరుచుకు పడ్డ ఇరాన్

పెద్ద ఎత్తున మంటలు చెలరేగినట్లు కువైట్ ప్రకటన



**కువైట్ సిటీ, (క్రైమ్ మిర్రర్):** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు రోజురోజుకు తీవ్రమవుతున్నాయి. శుక్రవారం కువైట్ లోని ప్రధాన చమురుశుద్ధి కర్మాగారం మినా అల్-అహ్మదిపై ఇరాన్ డ్రోన్లతో విరుచుకుపడింది.

## రెండో విడత రైతుభరోసాకు రంగం సిద్ధం

పంపిణీ కోసం సుమారు రూ. 2,650 కోట్లు అవసరం

నిధులు సమకూర్చాలని సిఎం రేవంత్ ఆదేశం




**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** తెలంగాణ రాష్ట్రంలోని సాగునీటి అవసరాలు, పెట్టుబడి కోసం ఎదురు చూస్తున్న రైతులకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఊరటనిచ్చే నిర్ణయం తీసుకుంది. యాసంగి సీజన్ పెట్టుబడి సాయం

- మిగతా 2వ పేజీలో

కెసిఆర్ కు కుమార్తె కవిత షాక్ ఇవ్వనున్నారా? ఆయన పార్టీని లాగేసుకోనున్నారా? తన పార్టీ పేరును టిఆర్ఎస్ గా ప్రకటించనున్నారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. ఇప్పటివరకు తన తెలంగాణ జాగృతిని.. తెలంగాణ ప్రజా జాగృతిగా మార్చుతారని ప్రచారం నడిచింది. అయితే సాంకేతిక పరమైన కారణాలతో ఇబ్బందులు వచ్చినట్లు తెలుస్తోంది. అందుకే తమ కుటుంబానికి అచ్చొచ్చిన టిఆర్ఎస్ పేరిట పార్టీని ఏర్పాటు చేస్తారని కొత్త ప్రచారం మొదలైంది.

## మళ్లీ టిఆర్ఎస్!?

### ఆ పేరుతోనే కొత్త పార్టీ

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత సంకేతాలు

తెలంగాణ ప్రజా జాగృతి పార్టీకి సాంకేతిక సమస్యలు

ప్రత్యామ్నాయం సిద్ధం చేసుకుంటున్న కవిత



**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో**

గులాబీ పార్టీలో కలవరం... ఇప్పటికే కవిత గులాబీ పార్టీకి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు. ఆది నుంచి ఆమె బిఆర్ఎస్ ను టార్గెట్ చేస్తూ వచ్చారు. ఆమె పార్టీ ఏర్పాటుతో గులాబీ పార్టీకి నష్టం అన్న వ్యాఖ్యలు ఉన్నాయి. ఇటువంటి తరుణంలో ఒకప్పటి టిఆర్ఎస్ పేరిట పార్టీని రిజిస్ట్రేషన్ చేస్తున్నట్లు తెలుస్తుండడం మాత్రం గులాబీ పార్టీలో గుబులు రేపుతోంది.

- మిగతా 2వ పేజీలో



వైష్ణవ సెంటిమెంట్ తో గులాబీ.. శైవ క్షేత్రాల అభివృద్ధితో రేవంత్

సరికొత్త సెంటిమెంటు అస్త్రంతో తెలంగాణ నేతలు

హిందుత్వ బిజెపికి కాస్త ఇబ్బందికరమే

## తెలంగాణలో 'భక్తి' ఫైట్!



**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో :**

తెలంగాణలో భక్తి ఫైట్ కొనసాగుతోంది. వైష్ణవ గులాబీ వెర్సెస్ సైవహస్తం అన్నట్టు పరిస్థితి మారింది. వైష్ణవ దేవాలయాలకు కెసిఆర్ పెద్దపీట వేస్తే.. శివాలయాలకు సీఎం రేవంత్ ప్రాధాన్యత ఇస్తున్నారు. కెసిఆర్ వదిలేసిన వాటికి సైతం రేవంత్ నిధులు సమకూరుస్తున్నారు. ఇలా పొలిటికల్ ఈక్వేషన్స్ మారుతుండడంతో తెలంగాణ రాజకీయాలు హాట్ హాట్ గా మారుతున్నాయి. కెసిఆర్ యాదాద్రి లో నరసింహ స్వామిని కోట్లాది రూపాయల ఖర్చు పెట్టి భారీ కోవెల కట్టారు. ఇప్పుడు రేవంత్ రెడ్డి భారీ

- మిగతా 2వ పేజీలో

## టెక్స్‌టైల్‌రంగంలో తెలంగాణ అగ్రగామి

### ఇక్కడ పెట్టుబడులు పెట్టేవారికి ప్రోత్సహిస్తాం

### చేనేత, ముత్యాలకు పెట్టింది పేరు తెలంగాణ

### ఆసియా టెక్స్‌టైల్స్ కాన్ఫరెన్స్‌లో సిఎం రేవంత్



**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** తెలంగాణ రైజింగ్‌లో పారిశ్రామికవేత్తలు భాగస్వాములు కావాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో నిర్వహించిన ఆసియా టెక్స్‌టైల్స్ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఉత్తమ వస్త్రాల రూపకల్పనలో

3లో

## యుఎస్ అటార్నీ జనరల్ పామ్ బోండీపై వేటు

ఎప్‌స్టీన్ వ్యవహారంలో సరిగా వ్యవహరించలేదన్న ఆరోపణ



**వాషింగ్టన్, (క్రైమ్ మిర్రర్):** యుఎస్ అటార్నీ జనరల్ పామ్ బోండీని ఆ పదవి నుండి ట్రంప్ యంత్రాంగం గురువారం తొలగించినట్లు వైట్‌హౌస్ తెలిపింది. అంతర్జాతీయంగా వివాదాస్పదమైన లైంగిక నేరగాడు జెఫ్రీ ఎప్‌స్టీన్‌కు సంబంధించిన దర్యాప్తు పత్రాల నిర్వహణ సహా పలు అంశాలపై ట్రంప్ అసహనం వ్యక్తం చేసినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ముఖ్యంగా తాను

2లో




## అప్పటి దాడి.. ఇప్పుడు వెలుగులోకి!



### పాలన వికేంద్రీకరణకు శాసనమండలిలో బ్రేక్

అనుమతించని చైర్మన్..

తీవ్ర ఆగ్రహంతో వైసిపి మంత్రుల దాడి

తాజాగా బయటపెట్టిన ఎంఎ షరీఫ్

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:**

అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ పార్లమెంట్ ఆమోదం తెలిపింది. ఉభయసభల్లోనూ ఈ చట్టబద్ధత బిల్లు పాస్ అయింది. రాష్ట్రపతి త్వరలో గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా సంబరాలు మిన్నంటాయి. ఈ నేపథ్యంలో గతంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో జరిగిన పరిణామాన్ని గుర్తు చేసుకున్నారు శాసనమండలి మాజీ చైర్మన్ ఎంఎ షరీఫ్. తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు.

3లో

## ఉమ్మడి పౌరస్మృతితో చొరబాటు దారులకు చెక్

వారు ఇక్కడ నాలుగేసి పెళ్లిళ్లు చేసుకోకుండా అడ్డుకట్ట

అసోం ఎన్నికల ప్రచారంలో అమిత్ షా



**గువాహటి, (క్రైమ్ మిర్రర్):** చొరబాటుదారులు నాలుగు పెళ్లిళ్లు చేసుకోకుండా ఉమ్మడి పౌరస్మృతితో అడ్డుకునే వీలుంటుందని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అన్నారు.

## రఘురామకృష్ణంరాజుకు షాక్!

రాష్ట్రపతికి ఏపీ నుంచి ఫిర్యాదులు

రాజ్యాంగబద్ధ పదవిలో ఉంటూ రాజకీయాలు మాట్లాడుతున్నారంటూ..

ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి రాష్ట్రపతి భవన్ లేఖ






## యుఎస్ అటార్నీ జనరల్ పామ్ బోండీపై వేటు

(మొదటి పేజీ తరువాయి)

దర్యాప్తు ఎదుర్కోవాలని కోరుకున్న విమర్శకులు, ప్రత్యర్థులపై అభియోగాలు మోపడంలో బోండీ తగిన విధంగా వ్యవహరించకపోవడం ట్రంప్‌ను తీవ్ర అసహనానికి గురిచేసినట్లు తెలిపాయి. పామ్ బోండీ పదవి నుండి తొలగింపబడిన రెండవ సీనియర్ అధికారి. మార్చి5న హోంల్యాండ్ సెక్యూరిటీ కార్యదర్శి క్రిస్టీ నోమ్‌ను ట్రంప్ పదవి నుండి తొలగించిన సంగతి తెలిసిందే. ఆ శాఖ నిర్వహణ తీరుపైనా, ట్రంప్ వలసవిధాన అజెండాపై వచ్చిన తీవ్ర విమర్శలతో క్రిస్టీ నోమ్‌ను పదవి నుండి తొలగించారు. యుఎస్ అటార్నీ జనరల్‌గా బోండీ తన పదవీ కాలంలో ట్రంప్ అజెండాకు గట్టి మద్దతుదారుగా నిలిచారు. న్యాయశాఖ తన దర్యాప్తులో వైట్‌హౌస్ నుండి స్వతంత్రంగా వ్యవహరించే సుదీర్ఘ సాంప్రదాయాన్ని ఇది నాశనం చేసింది. ట్రంప్ మిత్రులు, కొంతమంది రిపబ్లికన్ చట్టసభ్యులు సహా ఎప్‌స్టీన్ ఫైల్స్‌పై వచ్చిన విమర్శలు ఆమెను చుట్టుముట్టాయి. పలు రాజకీయ శక్తులు, కార్పోరేట్ అధిపతులు, ఆర్థిక సంస్థలు, పలుకుబడి కలిగిన వ్యక్తులు, కుబేరులతో ఎప్‌స్టీన్ సంబంధాలను అమెరికా న్యాయవ్యవస్థ డోజ్ జరిపిన దర్యాప్తు రికార్డులు వెల్లడికాకుండా అడ్డుకున్నారని, దుర్వినియోగం చేశారని ఆమెపై ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో ఈ అంశం ట్రంప్‌కు రాజకీయంగా తలనొప్పులు సృష్టించడంతో పాటు దశాబ్దాల క్రితం ముగిసిపోయిందని ఆయన ప్రకటించిన ఎప్‌స్టీన్‌తో సంబంధంపై తిరిగి నిశిత దర్యాప్తు చేపట్టేలా చేసింది. అయితే ఆమె తొలగింపు న్యాయశాఖలో భారీ మార్పులకు దారితీయవచ్చని పలువురు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ట్రంప్‌ను లక్ష్యంగా చేసుకున్న వారిపై డోజ్‌ను ప్రయోగించే దిశగా నూతన యత్నాలు చేపట్టవచ్చని పేర్కొన్నారు.



# తెలంగాణలో 'భక్తి' ఫైట్!

(మొదటి పేజీ తరువాయి)

శివాలయం నిర్మాణానికి పూనుకోవడం చూస్తుంటే పక్కా పొలిటికల్ వ్యూహం ఉన్నట్లు అర్థం అవుతోంది. తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు భక్తి సెంటిమెంట్ పతాక స్థాయికి చేరడం విశేషం.

**విష్ణు ఆలయాలకు ప్రాధాన్యం..**

గులాబీ బాస్ కెసిఆర్ కు భక్తి భావం ఎక్కువ. తరచూ యజ్ఞాలతో పాటు యాగాలు చేస్తుంటారు. చిన్న జీయర్ స్వామి సూచనలతో ఆగమశాస్త్రాల లెక్కలతో విష్ణు ఆలయాలకు ఎనలేని ప్రాధాన్యమిచ్చారు. అదే సమయంలో భద్రాచలం రామాలయాన్ని పెద్దగా పట్టించుకోలేదన్న విమర్శలను మూటగట్టుకున్నారు. దానిని రేవంత్ రెడ్డి క్యాచ్ చేసుకోవడం ప్రారంభించారు. భద్రాద్రి రామయ్యకు పట్టు వస్త్రాలు సమర్పించారు. శివాలయాల నిర్మాణం పై దృష్టిపెట్టారు. ఇప్పటికే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తనను తాను శివ భక్తుడిని అని చెప్పుకున్నారు. అందుకే రేవంత్ రెడ్డి అదే లైన్ తీసుకున్నారు. తెలంగాణలో వేములవాడ రాజన్న ఎంతో ప్రాముఖ్యం. అటువంటి ఆలయానికి రూ.100 కోట్లు ఇస్తానని చెప్పారు కెసిఆర్. కానీ ఇచ్చిన దాఖలాలు లేవు. అయితే సీఎం రేవంత్ బాధ్యతలు చేపట్టాక ఆ నిధులు ఇచ్చేందుకు సిద్ధపడ్డారు. ఇప్పుడు మూసి గట్టున 100 అడుగుల శివుడిని నిలబెడతాను అంటూ తేల్చి చెబుతున్నారు.

**ఆ రెండింటి మధ్య బిజెపి..**

తెలంగాణ రాజకీయాలను దేవుళ్ల మధ్య పోటీగా పెట్టేశారు రేవంత్ తో పాటు కేసీఆర్. అయితే కెసిఆర్ మార్కు భారీ గోపురాలు, శిల్ప కళలు, వైష్ణవ ఆడంబరం ఎక్కువగా ఉంటుంది. అయితే ఇప్పుడు దీనికి భిన్నంగా ఉంటుంది రేవంత్ రెడ్డి వ్యవహార శైలి. శివ భక్తితో పాటు సైవక్షేత్రాల అభివృద్ధి, జై భోలో అన్న నినాదాలను అందుకున్నారు రేవంత్. ఇప్పటికే తెలంగాణలో హిందుత్వవాదంతో ముందుకు వెళ్తోంది బిజెపి. కానీ తమ రాజకీయ వైరి పక్షాలు భక్తి అనే సెంటిమెంటును ప్రదర్శిస్తుండడం కాషాయ దళానికి కూడా ఇబ్బందికరంగా మారింది. ఎన్నికలు సమీపించే కొలది తెలంగాణ పాలిటిక్స్ లో భక్తి అనే అంశం మరింత పని చేయనుంది అన్నమాట.

# రెండో విడత రైతుభరోసాకు రంగం సిద్ధం



కింద అందించే 'రైతు భరోసా' రెండో విడత నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసేందుకు ముహూర్తం ఖరారైంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఒత్తిడిలో ఉన్నప్పటికీ, రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ఈ అడుగు వేస్తోంది. రెండో విడత పంపిణీ కోసం సుమారు రూ. 2,650 కోట్ల భారీ మొత్తాన్ని సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించినట్లు సమాచారం. ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలు, పెన్షన్లు, రుణాల చెల్లింపులు పూర్తయిన వెంటనే.. ఈ నిధులను సేకరించే పనిలో యంత్రాంగం నిమగ్నమైంది. మొత్తం రూ. 9,000 కోట్ల అవసరం ఉన్న ఈ పథకాన్ని, నిధుల లభ్యతను బట్టి ప్రభుత్వం మూడు విడతల్లో పూర్తి చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే ఎకరం లోపు ఉన్న రైతులకు మొదటి విడత నిధులు అందగా, ఇప్పుడు ఒకటి నుంచి ఐదు ఎకరాల వరకు సాగు భూమి ఉన్న రైతులకు ఈ నెల రెండో వారంలో నగదు జమ కానుంది. ఐదు ఎకరాల కంటే ఎక్కువ విస్తీర్ణం ఉన్న రైతులకు ఈ నెలాఖరు కల్లా వారి వాటా నిధులు అందుతాయి. ప్రస్తుతం అమలులో ఉన్న విధానం ప్రకారం, ప్రతి ఎకరాకు సాగు ఖర్చుల కోసం ప్రభుత్వం రూ. 6,000 ఆర్థిక సాయం అందిస్తోంది. నేరుగా రైతుల బ్యాంక్ ఖాతాల్లోకే ఈ నగదు బదిలీ కానుండటంతో ఎక్కడా జాప్యం లేకుండా రైతులకు మేలు జరుగుతుంది.

# కువైట్ చమురుశుద్ధి కర్మాగారంపై దాడి

దీంతో ఆ ప్రాంతంలో భారీఎత్తున మంటలు చెలరేగినట్లు కువైట్ పెట్రోలియం కార్పొరేషన్ ప్రకటించింది. మంటలు అదుపు చేయడానికి అగ్నిమాపక సిబ్బంది కృషి చేస్తున్నారని పేర్కొంది. ఈ దాడిలో ఎటువంటి ప్రాణనష్టం సంభవించలేదని తెలిపింది. ప్రపంచంలోని అతిపెద్ద చమురు శుద్ధి కర్మాగారాల్లో మీనా అల్-అహ్మది ఒకటి. కువైట్ చమురు ఉత్పత్తికి ఇది చాలా కీలకం. మీనా అల్-అహ్మది కర్మాగారం నుంచి రోజుకు 3,46,000 బ్యారెళ్ల చమురును ఉత్పత్తి చేస్తారు. దాదాపు లక్షల బ్యారెళ్ల మేర డీజిల్, ఇతర శుద్ధి చేసిన ఇంధనాలను ఆసియా, యూరప్‌లోని మార్కెట్లకు ఎగుమతి చేస్తూ.. ప్రభుత్వానికి కీలకమైన ఆదాయ వనరుగా నిలుస్తోంది. ఈ కర్మాగారం లేకపోతే అక్కడ ఉత్పత్తి అయ్యే చమురును శుద్ధి చేయలేక బావులను మూసివేయాల్సిన పరిస్థితి తలెత్తుతుంది. ఇక్కడినుంచి భారత్‌తో సహా ఇతర ప్రపంచదేశాలు చమురు దిగుమతి చేసుకుంటాయి. పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రస్తుతం భారత్.. కువైట్ నుంచి చమురు దిగుమతులు నిలిపివేసింది. జాతీయ ఆయిల్ కంపెనీపై డ్రోన్ దాడి జరిగినట్లు కువైట్ న్యూస్ ఏజన్సీ శుక్రవారం పేర్కొంది. దీంతో పలు యూనిట్లలో మంటలు చెలరేగాయని తెలిపింది. ఉదయం మినా అల్-అహ్మదీ ర్ఫిౖనెరీ లక్ష్యంగా డ్రోన్ దాడి జరిగిందని కువైట్ పెట్రోలియం కార్పోరేషన్ (కెపిసి) మీడియాకు తెలిపింది. ఫలితంగా పలు యూనిట్లలో మంటలు చెలరేగాయని, అత్యవసర బృందాలు సహాయక చర్యలు చేపడుతున్నాయని పేర్కొంది. గల్ఫ్ భూభాగంపైకి ప్రయోగించిన క్షిపణులు, డ్రోన్‌లను వైమానిక రక్షణవ్యవస్థ సమర్థవంతంగా అడ్డుకుంటుందని కువైట్ సైన్యం ఒక ప్రకటనలో తెలిపింది. దేశవ్యాప్తంగా సైరన్‌లు మోగుతున్నాయని బహ్రెయిన్ అంతర్గత మంత్రిత్వ శాఖ ప్రకటించింది.

# మళ్లీ టిఆర్ఎస్!?

తన తెలంగాణ ప్రజా జాగృతికి సాంకేతిక పరమైన అంశాలు ఇబ్బందికరంగా మారాయి. అందుకే కోర్టులోను పిటిషన్ వేసారు. మారిన పరిస్థితుల నేపథ్యంలో ఆవిడ ప్లాన్ మార్చుకున్నట్లు కనిపిస్తోంది. టిఆర్ఎస్ పేరుతోనే పార్టీ పెట్టాలని అనుకుంటున్నట్లు సమాచారం.

**ఈ నెలలోనే ప్రకటన..**

ఏప్రిల్ లోనే ఆమె పార్టీని ప్రకటిస్తానని చెప్పిన సంగతి తెలిసిందే. అయితే తాజాగా హైదరాబాదులో మీడియా ప్రతినిధులతో నిర్వహించిన చిట్ చాట్ లో మళ్లీ పాత పేరుతో అంటే టిఆర్ఎస్ పేరుతో సరికొత్త అజెండాతో ముందుకు రాబోతున్నట్లు సంకేతాలు ఇచ్చారు. ప్రస్తుతం ఈసీ వద్ద ఆ పేరు అందుబాటులో ఉందని.. పార్టీ రిజిస్ట్రేషన్ కోసం ఒక ప్రత్యేక బృందం ఢిల్లీలో పనిచేస్తుందని ఆమె వెల్లడించారు. అయితే పార్టీ జెండాకు సంబంధించిన రంగులు ఎట్టి పరిస్థితుల్లో పింక్ ఉండదని తేల్చి చెప్పారట కవిత.

**చంద్రబాబుపై ప్రశంసలు..**

ఏపీ సీఎం చంద్రబాబును ప్రశంసించారు కవిత. ఆయన మంచి



హార్డ్ వర్కర్ అంటూ తేల్చి చెప్పారు. టిడిపి నిర్మాణం కూడా చాలా బలంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఏపీతో ఎటువంటి సంబంధాలు పెట్టుకునే పరిస్థితిలో లేమని కూడా చెప్పారు. అమరావతి గురించి పట్టించుకోమని.. కేవలం తెలంగాణ ప్రయోజనాలే తమకు ముఖ్యమని తేల్చి చెప్పారు. గజ్వేల్ నుంచి మహిళా రిజర్వేషన్ కింద పోటీ చేసి ఆలోచన ఉందని కూడా చెప్పారు. నిజామాబాద్ జిల్లాలో కూడా వచ్చే ఎన్నికల్లో మహిళల ప్రాతినిథ్యం పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తనపై ఉన్న లిక్కర్ కేసు కొట్టేయడం పై స్పందిస్తూ ప్రకృతి సహకరిస్తోందని వ్యాఖ్యానించారు. అదృష్టవంతుడిని ఎవరు ఆపలేరని ధీమా వ్యక్తం చేశారు. కెసిఆర్ కూడా ఎంతో కష్టపడి పార్టీని అధికారంలోకి తెచ్చారని.. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని తెలంగాణ జాగృతి పార్టీ కోసం తాను కూడా నిరంతరం శ్రమిస్తానని కవిత స్పష్టం చేశారు. మొత్తానికి అయితే టిఆర్ఎస్ పార్టీతో మరోసారి తెలంగాణలో పవర్ సాధించాలన్న ఆలోచనలో ఉన్నారు కవిత. మరి అందులో ఎంతవరకు సక్సెస్ అవుతారో చూడాలి.

# రఘురామకృష్ణంరాజుకు షాక్!

(మొదటి పేజీ తరువాయి)

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజుకు షాక్ తగిలింది. ఆయనపై రాష్ట్రపతి కార్యాలయానికి ఫిర్యాదు అందింది. రాజ్యాంగబద్ధ పదవిలో ఉంటూ రాజకీయాలు మాట్లాడుతున్నారని.. రాజకీయ ప్రత్యర్థులకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేస్తున్నారు అంటూ జై భీమ్ రావు భారత్ పార్టీ ప్రతినిధి సురేష్ కుమార్ ఫిర్యాదు చేశారు రాష్ట్రపతి కార్యాలయానికి. దీనిపై స్పందించిన రాష్ట్రపతి భవన్ ప్రాథమిక విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. ఈ మేరకు లేఖ రాసింది. అయితే ఈ ఫిర్యాదు వెనుక వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హస్తం ఉందన్న అనుమానాలు ఉన్నాయి. ఎందుకంటే రఘురామకృష్ణం రాజు ఎక్కువగా కామెంట్స్ చేసేది ఆ పార్టీ పైనే.

**రాజకీయాలు మాట్లాడుతున్నారని..**

రాజ్యాంగబద్ధ పదవిలో ఉండేవారు రాజకీయాల కోసం మాట్లాడకూడదు. ఇది నిబంధన కూడా. రఘురామకృష్ణంరాజు ఇప్పుడు అటువంటి వ్యాఖ్యలు చేస్తున్నారు. ఆయనపై ఫిర్యాదు చేయడంలో తప్పులేదు. కానీ వైయస్సార్ కాంగ్రెస్ హయాంలో స్పీకర్ గా ఉండే తమ్మినేని సీతారాం అయితే రాజకీయ విమర్శలు నిత్యం చేసేవారు. రాజకీయ ప్రత్యర్థులపై వ్యక్తిగత వ్యాఖ్యలు కూడా చేసేవారు. తాను ముందుగా ఒక ఎమ్మెల్యే నని.. తరువాతే స్పీకర్ అన్న విషయాలను గుర్తు చేసుకోవాలని పదేపదే చెప్పుకొచ్చేవారు తమ్మినేని. శాసన వ్యవస్థ పై న్యాయవ్యవస్థ పెత్తనం ఏంటని కూడా అప్పట్లో ప్రశ్నించారు తమ్మినేని. ఇప్పుడు రఘురామకృష్ణం రాజు చేసిన వ్యాఖ్యలు కేవలం విధానపరమైనవి మాత్రమే. వ్యక్తిగత అంశాల జోలికి వెళ్లడం లేదు రఘురామకృష్ణంరాజు. కేవలం సమకాలీన అంశాలపై మాత్రమే ఆయన మాట్లాడుతున్నారు. అయినా సరే ఆయనపై ఫిర్యాదు వెళ్లడంతో రాష్ట్రపతి భవన్ స్పందించింది.

**వైసీపీకి ఇబ్బంది..**

రఘురామకృష్ణం రాజు విషయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇబ్బంది పడుతోంది. ఎందుకంటే ఆయన వ్యాఖ్యలు సెటైరికల్ గా ఉంటాయి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఎంపీగా ఉంటూ భంగపడ్డారు రఘురామకృష్ణం రాజు. అందుకే జగన్మోహన్ రెడ్డి నాయకత్వాన్ని విభేదించి బయటకు వచ్చేసారు. చంద్రబాబు గుర్తించి రఘురామకృష్ణం రాజుకు ఉండి శాసనసభ టిక్కెట్ ఇచ్చారు. అయితే ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత రఘురామకృష్ణం రాజుకు మంత్రి పదవి ఇస్తారని ప్రచారం నడిచింది. స్పీకర్ పదవి కూడా ఇస్తారని టాక్ నడిచింది. చివరకు డిప్యూటీ స్పీకర్ పదవితో సరిపెట్టారు. అయినా ఆ పదవిని బాగా ఎంజాయ్ చేస్తున్నారు రఘురామకృష్ణం రాజు. నేరుగా రాజకీయ విమర్శలు చేయకుండా.. పూర్తిగా సెటైరికల్ కామెంట్స్ చేస్తూ వచ్చారు. ఇటీవల ఉండి నియోజకవర్గంలో రామాలయంలో జరిగిన వివాదం పెను దుమారానికి దారితీసింది. ఈ నేపథ్యంలోనే రెండోసారి ఆయనపై రాష్ట్రపతికి ఫిర్యాదు అందినట్లు సమాచారం. అయితే తొలిసారి రాష్ట్రపతి పవన్ పట్టించుకోలేదు కానీ.. రెండోసారి ఫిర్యాదు వచ్చేసరికి మాత్రం స్పందించింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కి లేఖ రాసింది రాష్ట్రపతి భవన్. తదుపరి పరిణామాలు ఎలా ఉంటాయో చూడాలి..



# కాంగ్రెస్‌తో సిపిఐ కటీఫ్!

ఆ రెండు పార్టీలు పొత్తు పెట్టుకున్నాయి. పొత్తులో భాగంగా కొత్తగూడెం నియోజకవర్గాన్ని సిపిఐ కి కేటాయించారు. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు పోటీ చేసి గెలిచారు. అయితే ఫలితాలు వచ్చిన తర్వాత అక్కడ సీన్ మారుతున్నట్లు కనిపిస్తోంది. ముఖ్యంగా ఆ జిల్లా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో కూనమనేని సాంబశివరావుకు విభేదాలు పెరిగినట్లు ప్రచారం సాగుతోంది. కొత్తగూడెం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ పట్టు కోసం ప్రయత్నాలు ప్రారంభించింది. దీంతో ఒక్కసారిగా సీన్ మారినట్లు కనిపిస్తోంది. స్థానిక ఎమ్మెల్యేగా ఉన్న సాంబశివరావు కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ప్రభుత్వంపై కీలక వ్యాఖ్యలు చేశారు. వీరు వీరి పాలన అంటూ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ప్రభుత్వ పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. అధికారిక కార్యక్రమంలో.. అధికారుల సమక్షంలోనే ప్రభుత్వం పై సిపిఐ రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న సాంబశివరావు ఈ వ్యాఖ్యలు చేయడం విశేషం.దీంతో సిపిఐ కాంగ్రెస్ పార్టీతో తెగతెంపులు చేసుకోవడం ఖాయమని ప్రచారం జరుగుతోంది.

**కొత్తగూడెం పై పట్టు..**

మొన్నటి పంచాయితీ ఎన్నికల్లో స్నేహపూర్వక పోటీ పేరిట కాంగ్రెస్, సిపిఐ వేర్వేరుగా పోటీచేసాయి. ఇద్దరికీ కాస్త అటు ఇటుగా సీట్లు వచ్చాయి. ఇప్పుడు ఎవరు ఎక్కువ అన్న చర్చ జరుగుతున్న క్రమంలో విభేదాలు పెరుగుతున్నట్లు తెలుస్తోంది. పంచాయతీ ఎన్నికల్లో సీట్ల పరంగా కాంగ్రెస్.. ఓట్ల పరంగా సిపిఐ ప్రథమ స్థానంలో ఉన్నట్లు తెలుస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కొత్తగూడెంలో తమకు బలం ఉందని సిపిఐ పట్టుబట్టి మరి ఈ సీటును తీసుకుంది. అయితే ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ వచ్చే ఎన్నికలపై దృష్టి పెట్టడంతో ఎమ్మెల్యేగా ఉన్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు తీవ్ర ఆగ్రహంతో రగిలిపోతున్నట్లు తెలుస్తోంది. తమ బలంతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని ఆయన భావన. పంచాయితీ ఎన్నికల్లో సైతం తమకే ఎక్కువ ఓట్లు వచ్చాయని ఆయన వాదిస్తున్నట్లు కనిపిస్తోంది.

**తీవ్ర మనస్తాపంతో సిపిఐ..**

కాంగ్రెస్ పార్టీతో సిపిఐ స్నేహంగా ఉన్నా లోలోపల మాత్రం మనస్తాపంతో ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంతో స్నేహంగా ఉంటాం కానీ.. సమస్యల విషయంలో మాత్రం తాము ప్రజల పక్షం ఉంటామని సాంబశివరావు హెచ్చరించారు. ఓట్లతోపాటు సీట్ల కోసం అర్రులు చాచే రకం కమ్యూనిస్టులు కాదన్న విషయాన్ని గుర్తించుకోవాలని హెచ్చరించారు. తద్వారా అవసరం అనుకుంటే కాంగ్రెస్ స్నేహాన్ని వదులుకునేందుకు సిద్ధం అని ఆయన సంకేతాలు ఇచ్చారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, సిపిఐ మధ్య దోస్తీ కుదిరింది. ఆ ఎన్నికల్లో రెండు పక్షాలు కలిసి పోటీ చేశాయి. కానీ పంచాయతీ ఎన్నికల నాటికి స్నేహపూర్వక పోటీ కొనసాగింది. మున్సిపల్ ఎన్నికలకు వచ్చేసరికి పొత్తు పెటాకులైంది. పైగా కాంగ్రెస్ వైరిపక్షమైన గులాబీ పార్టీతో సిపిఐ దోస్తీకి దిగింది. మున్సిపల్ ఎన్నికల బరిలో కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా సిపిఐ అభ్యర్థులు పోటీ చేశారు. ప్రధానంగా కొత్తగూడెం కార్పొరేషన్, ఖమ్మం జిల్లాలోని ఏదులాపురం, మహబూబాబాద్, మంచిర్యాల, జనగామ తదితరచోట్ల కాంగ్రెస్ పార్టీ నుంచి ఎక్కువ సీట్లు ఆశించింది సిపిఐ. కానీ సిపిఐ కు అంత ఇవ్వాల్సిన అవసరం లేదన్నట్టు కాంగ్రెస్ భావించింది. అందుకే సిపిఐ ని పట్టించుకోకుండా కాంగ్రెస్ ఒంటరి పోరాటానికి దిగింది. అసెంబ్లీ ఎన్నికల్లో తమతో పొత్తు పెట్టుకుని.. మున్సిపల్ ఎన్నికలకు వచ్చేసరికి కాంగ్రెస్ మాట మార్చడాన్ని సిపిఐ జీర్ణించుకోలేకపోయింది. ముఖ్యంగా కొత్తగూడెం నియోజకవర్గంలో జరుగుతున్న పరిణామాలతో కూనంనేని సాంబశివరావు తీవ్ర ఆగ్రహంతో రగిలిపోతున్నారు. దీంతో కాంగ్రెస్ పార్టీతో పొత్తు విచ్ఛిన్నం అయితే.. కచ్చితంగా గులాబీ పార్టీ సిపిఐ ని చేరదీస్తుంది. అందుకే తెలంగాణ రాజకీయ పరిణామాలు మారే అవకాశం ఉంది.




# కష్టకాలంలో కాంగ్రెస్ జెండా మోసినోళ్లకే పట్టం కట్టాలి!

## అధికారం రాగానే కొత్తగా వచ్చి పెత్తనం చేస్తామంటే చూస్తూ ఊరుకోం

### మంచిర్యాల సమావేశంలో ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు ఘాటు వ్యాఖ్యలు

**మంచిర్యాల, ఏప్రిల్ 3 (క్రైమ్ మిర్రర్):** "పదేళ్ల బీఆర్ఎస్ రాక్షస పాలనలో కాంగ్రెస్ జెండా పట్టుకుని, అక్రమ కేసులను ఎదుర్కొని, తిండి ఉన్నా లేకున్నా పార్టీ కోసం కొట్లాడింది కార్యకర్తలే. ఇప్పుడు అధికారం రాగానే కొత్తగా వచ్చి మాపై పెత్తనం చేస్తామంటే చూస్తూ ఊరుకునే ప్రసక్తి లేదు" అని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు హెచ్చరించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన కాంగ్రెస్ సర్వసభ్య సమావేశంలో ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు.

**జెండా మోసినోళ్లకే ప్రాధాన్యం..**

పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు వెన్నంటే నిలిచిన వారిని విస్మరించవద్దని పీసీసీ అధ్యక్షుడికి ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. "ప్రభుత్వం వేరు.. పార్టీ వేరు. క్షేత్రస్థాయిలో పార్టీని బతికించింది కార్యకర్తలు. వాళ్లకు సముచిత గౌరవం దక్కకపోతే వచ్చే ఎన్నికల్లో ఫలితాలు తారుమారయ్యే ప్రమాదం ఉంది. కార్యకర్తలు కరడుగట్టి పనిచేసినప్పుడే రాష్ట్రంలో మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి వస్తుంది" అని స్పష్టం చేశారు.

**జిల్లాలో క్లీన్ స్వీప్ చేశాం..**




గత ఎన్నికల్లో మంచిర్యాల జిల్లాలోని నాలుగు స్థానాల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేశామని, ఇది కార్యకర్తల కష్టార్జితమేనని ప్రేమ్ సాగర్ రావు గుర్తు చేశారు. ఇతర జిల్లాల్లో ఆరు సీట్లు ఎందుకు ఓడిపోయారో నాయకత్వం ఆలోచించాలని సూచించారు. కొత్తగా ఏర్పడిన కార్యవర్గంలో నిజమైన కార్యకర్తలకు న్యాయం జరగాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, గడ్డం వివేక్ వెంకటస్వామి, ఎమ్మెల్సీ సతీష్ విట్టల్ తదితరులు పాల్గొన్నారు.



## కాకా వెంకటస్వామి జ్ఞాపకార్థంగ చలివేంద్రాన్ని ప్రారంభించిన బండి సదానందం

**మందమరి టౌన్ ఏప్రిల్ 03 క్రైమ్ మిర్రర్:** మందమర్రి పట్టణం పాత బస్టాండ్ లో ఉచిత చలివేంద్రాన్ని అఖిల భారత యాదవ సంఘం నాయకులు కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు బండి సదానంద యాదవ్ ఆధ్వర్యంలో గురువారం ప్రారంభించారని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెన్నూరు శాసనసభ్యులు రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి ఆధ్వర్యంలో చెన్నూరు నియోజకవర్గం అభివృద్ధి పథంలో ముందుకు వెళుతుందని అందులో భాగంగానే స్వర్గీయ కాకా వెంకట్ స్వామి జ్ఞాపకార్థం చలివేంద్రాన్ని ప్రారంభించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బత్తుల తిరుపతి, నాగుల దుర్గయ్య, తోట నరహరి, రామస్వామి,ఆర్ రామ్ రెడ్డి,ఆటో యూనియన్ రామిరెడ్డి, తోటరాజు తదితరులు పాల్గొన్నారు.

# టెక్స్‌టైల్‌రంగంలో తెలంగాణ అగ్రగామి

భారత్‌కు గొప్ప చరిత్ర ఉంది. అనేక రంగాల్లో తెలంగాణ అగ్రగామిగా కొనసాగుతోంది. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే మా లక్ష్యం. పెట్టుబడిదారులకు కావాల్సిన అన్ని సౌకర్యాలూ కల్పిస్తాం. టెక్స్‌టైల్స్ కేవలం పరిశ్రమే కాదు.. చేనేతలకు జీవితం. దక్షిణాసియా టెక్స్‌టైల్స్ క్యాపిటల్‌గా తెలంగాణను తీర్చిదిద్దుతాం. ప్రపంచంలోనే ఫిల్మ్ ప్రొడక్షన్ డెస్టినేషన్‌గా హైదరాబాద్ మారింది. చిత్ర పరిశ్రమను ప్రోత్సహిస్తాం. పర్యావరణ పరిరక్షణెకి మా తొలి ప్రాధాన్యం అని రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన టెక్స్‌టైల్ రంగ ప్రముఖులకు స్వాగతం పలుకుతూ, తెలంగాణను ప్రపంచ వస్త్ర రంగ పటంలో అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రభుత్వ దార్శనికతను పంచుకున్నారు. తెలంగాణకు వస్త్ర రంగంతో ఉన్న చారిత్రక అనుబంధాన్ని గుర్తుచేశారు. భారతదేశానికి అత్యుత్తమ వస్త్రాలను తయారు చేసిన గొప్ప చరిత్ర ఉంది. తెలంగాణ గర్వంగా చెబుతోంది.. టెక్స్‌టైల్ మన డిఎన్ఎలోనే ఉంది. నిజాం కాలంలోనే ప్రపంచ నలుమూలల నుండి వ్యాపారులు హైదరాబాద్ కు వచ్చి వస్త్రాలు, ముత్యాలు కొనుగోలు చేసేవారు అని ఆయన పేర్కొన్నారు. కేవలం పరిశ్రమగానే కాకుండా, ఇది లక్షలాది మందికి జీవనాధారమని.. పోచంపల్లి ఇక్కత్, గద్వాల్ చీరలు, వరంగల్ దుర్రీస్ వంటివి మన సంస్కృతికి ప్రతీకలని తెలిపారు. తెలంగాణ రైజింగ్ 2047' గురించి ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర అభివృద్ధిపై స్పష్టమైన రోడ్ మ్యాప్‌ను వివరిస్తూ, 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్‌ను సీఎం ప్రకటించారు. ఇందులో భాగంగా 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగడమే లక్ష్యం అని పేర్కొన్నారు. ఇంకా 2047 నాటికి తెలంగాణను దక్షిణ ఆసియాలోనే టెక్స్‌టైల్ రాజధానిగా మార్చడమే మా సంకల్పం అని అన్నారు. అలాగే వరంగల్‌లో ఏర్పాటు చేసిన కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ ద్వారా ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం పత్తి నాణ్యతకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉందని, పత్తి ఉత్పత్తిలో రాష్ట్రం అగ్రగామిగా ఉందని సీఎం అన్నారు. ఈ సందర్భంగా పెట్టుబడిదారులకు ఆయన పిలుపునిస్తూ.. 'మీకు విజన్ ఉంటే, మేము మీకు సరైన భాగస్వాములం. మౌలిక సదుపాయాలు, భూమి, విద్యుత్, నీరు, వేగవంతమైన అనుమతులతో పాటు ప్రపంచ స్థాయి విధానాలను మా ప్రభుత్వం అందిస్తుంది అంటూ హామీ ఇచ్చారు. డీప్ టెక్, ఫార్మా, ఏరోస్పేస్ వంటి రంగాల్లో ఇప్పటికే ముందంజలో ఉన్న తెలంగాణ, ఇప్పుడు టెక్స్‌టైల్ ఎకోసిస్టమ్ ను మరింత బలోపేతం చేస్తుందని అన్నారు. మరోవైపు హైదరాబాద్ ఇప్పుడు ప్రపంచ సినిమా నిర్మాణ కేంద్రంగా ఎదుగుతోందని, నెట్‌ఫ్లిక్స్ వంటి సంస్థలు ఇక్కడ స్టూడియోలను ప్రారంభించడాన్ని ఆయన ప్రస్తావించారు. టాలీవుడ్, బాలీవుడ్ మాత్రమే కాక హాలీవుడ్ కూడా హైదరాబాద్ ను కేంద్రంగా చేసుకుంటున్న తరుణంలో సినిమా రంగానికి అవసరమైన ఫ్యాషన్ ను కూడా తెలంగాణ నుంచే అందించేలా ప్రోత్సహిస్తామని చెప్పారు. అదే సమయంలో పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తూ 'గ్రీన్ టెక్స్‌టైల్ హబ్' లను అభివృద్ధి చేస్తామని ప్రకటించారు.

## మాడ్గుల మండలం లో రెవెన్యూ రికార్డుల గందరగోళం...

### సాధాభైనం భూములు ఇతరుల పేర్లకు మార్పిడి..!



**రంగారెడ్డి ప్రతినిధి (క్రైమ్ మిర్రర్):** రంగారెడ్డి జిల్లాలోని మాడ్గుల మండలంలో రెవెన్యూ రికార్డుల మార్పిడి వ్యవహారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చి తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. గతంలో సాధాభైనం ద్వారా భూములు కొనుగోలు చేసిన రైతులు ప్రస్తుతం తమ హక్కులను కోల్పోయే పరిస్థితి ఎదుర్కొంటున్నారు. సుమారు 20 నుండి 30 సంవత్సరాల క్రితం మండలానికి చెందిన పలువురు నిరుపేద రైతులు సాధాభైనం పద్ధతిలో భూములు కొనుగోలు చేసి అప్పటి నుండి సాగు చేస్తున్నారు. అయితే ఇప్పటివరకు వారికి పూర్తి హక్కు పత్రాలు అందలేదు. ఈ లోపాన్ని ఆసరాగా తీసుకున్న కొందరు రియల్ ఎస్టేట్ దళారులు, రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై సంబంధం లేని వ్యక్తుల పేర్లపై ఆ భూములను ఆన్‌లైన్ రికార్డుల్లో నమోదు చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బాధితుల వివరాల ప్రకారం, దాదాపు 20 ఎకరాల భూమి ఈ విధంగా అక్రమంగా ఇతరుల పేర్లకు మార్పిడి చేయబడిందన్నారు. ఏళ్ల తరబడి కబ్జాలో ఉంటూ సాగు చేస్తున్న తమ భూములు ఇలా మారిపోవడం పట్ల రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై బాధితులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా, పూర్తి స్థాయి విచారణ జరిపి అక్రమ మార్పిడులను రద్దు చేసి, అసలైన యజమానులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. రెవెన్యూ శాఖలో గతం లో జరిగిన ఇలాంటి ఘటనలపై పూర్తి స్థాయి లో విచారణ జరిపి వారి పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## తమిళనాట 27మందితో బిజెపి జాబితా

### అన్నామలైకి దక్కని స్థానం.. పార్టీతో దూరం పెరిగిందన్న ప్రచారం

చెన్నై: తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే 27 మంది పార్టీ అభ్యర్థులను బీజేపీ శుక్రవారంనాడు ప్రకటించింది. కీలక నేతలైన పార్టీ రాష్ట్ర విభాగం అధ్యక్షుడు నాగేంద్రన్, కేంద్ర మంత్రి ఎల్ మురుగన్, తమిళిసై సౌందరరాజన్‌కు పార్టీ టిక్కెట్ దక్కినప్పటికీ, పార్టీ మాజీ అధ్యక్షుడు, కీలక నేత కె.అన్నామలైకి ఈ జాబితాలో చోటుదక్కలేదు. అన్నామలై 2021 జూలై నుంచి ఏప్రిల్ 2025 వరకూ బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడుగా ఉన్నారు. అయితే ఈసారి ఎన్నికల్లో పోటీకి ఆయనను పార్టీ అధిష్ఠానం దూరంగా ఉంచింది. దీనిపై నాగేంద్రన్‌ను అడిగినప్పుడు, పార్టీ కేంద్ర నాయకత్వం ఈ నిర్ణయం తీసుకుందని చెప్పారు. పార్టీ ప్రకటించిన 27 మంది కచ్చితంగా నెగ్గితీరుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.




# అప్పటి దాడి.. ఇప్పుడు వెలుగులోకి!

తనపై వైసీపీ మంత్రులతో పాటు ఎమ్మెల్యేలు దాడి చేసినంత పని చేశారని గుర్తు చేసుకున్నారు. తన గుండెపై చేయి వేసి నెట్టేశారని కూడా చెప్పుకొచ్చారు.

**శాసనసభ వరకు ఓకే..**

2019లో అధికారంలోకి వచ్చింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. పాలనా వికేంద్రీకరణ పేరుతో మూడు రాజధానుల అంశాన్ని తెరపైకి తెచ్చింది. అందుకు సంబంధించి పాలనా వికేంద్రీకరణ బిల్లును శాసనసభలో పెట్టింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఏకపక్షంగా బలం ఉండడంతో శాసనసభలో ఆ బిల్లు పాస్ అయింది. కానీ అదే బిల్లు శాసనమండలిలో మాత్రం పాస్ కాలేదు. ప్రజాభిష్టానికి వ్యతిరేకంగా తాను నిర్ణయం తీసుకోలేనట్టు శాసనమండలి చైర్మన్ గా ఉన్న ఎంఏ షరీఫ్ తిరస్కరించారు. సెలెక్ట్ కమిటీకి పంపించారు. దీంతో తీవ్ర కోపోద్రిక్తులైన అప్పటి వైసీపీ మంత్రులతో పాటు ఎమ్మెల్సీలు మండలి చైర్మన్ పోడియం చుట్టూ దూసుకెళ్లారు. ఈ క్రమంలోనే ఒక మంత్రి షరీఫ్ పట్ల అనుచితంగా ప్రవర్తించినట్లు తెలుస్తోంది. నానా దుర్భాషలాడుతూ అప్పట్లో తనను ఇబ్బంది పెట్టిన విషయాన్ని షరీఫ్ తాజాగా బయటపెట్టారు.

**చుట్టుముట్టిన మంత్రులు..**

2022 ఆగస్టులో పాలనా వికేంద్రీకరణకు సంబంధించిన బిల్లు శాసనమండలికి వెళ్ళింది. అధ్యక్ష స్థానంలో ఉన్న ఎంఏ షరీఫ్ వ్యతిరేకించడంతో అప్పట్లో మంత్రులుగా ఉన్న బొత్స సత్యనారాయణ, అనిల్ కుమార్ యాదవ్, కొడాలి నాని, వెల్లంపల్లి శ్రీనివాస్ తదితరులు చాలా దూకుడుగా వ్యవహరించారు. ముఖ్యంగా వెల్లంపల్లి శ్రీనివాస్ వ్యవహార శైలిపై అప్పట్లో మీడియాలో కూడా కథనాలు వచ్చాయి. నాడు వైసిపి సభ్యులు వ్యవహరించిన తీరుతో శాసనమండలిలో మైకులు కూడా ధ్వంసం అయ్యాయి. అయితే నాడు తనకు జరిగిన అవమానాన్ని బయటపెట్టారు షరీఫ్.

**ఆయన వల్లే అమరావతి సజీవం**

ఆరోజు పాలన వికేంద్రీకరణ బిల్లును షరీఫ్ అడ్డుకోకుంటే మాత్రం అమరావతి ఈ స్థాయిలో ఉండేది కాదు. కేవలం సెలెక్ట్ కమిటీకి తిరిగి పంపడంతోనే ఆ ప్రక్రియ అప్పట్లో నిలిచింది. నాడే పాలనా వికేంద్రీకరణ బిల్లు ఆమోదం పొంది ఉంటే పరిస్థితి ఇంకోలా ఉండేది. ఒక విధంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అప్పుడే షాక్ తగిలింది. అందుకే అప్పట్లో సీఎం గా ఉన్న జగన్మోహన్ రెడ్డి ఏకంగా శాసనమండలిని రద్దు చేయాలని సిఫారసు చేసే దాకా పరిస్థితి వచ్చింది. మొత్తానికైతే శాసనమండలి చైర్మన్ గా ఉన్న ఎంఏ షరీఫ్ తనకు జరిగిన అవమానం గురించి బాహటంగా చెప్పడం హాట్ టాపిక్ అవుతోంది.

# ఉమ్మడి పౌరస్మృతితో చొరబాటు దారులకు చెక్

(మొదటి పేజీ తరువాయి)



అస్సాంలోని గోల్‌పాడాలో శుక్రవారంనాడు జరిగిన ఎన్నికల ప్రచార సభలో అమిత్‌షా మాట్లాడుతూ, తిరిగి తాము అధికారంలోకి వస్తే అక్రమ చొరబాట్ల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు. గిరిజనాభివృద్ధికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ సమగ్ర మ్యాప్ సిద్ధం చేశారని అమిత్‌షా తెలిపారు. దీనిని ముందుకు తీసుకువెళ్లి, సమర్ధవంతంగా అమలు చేయాలంటే బీజేపీకే ప్రజలు ఓటు వేయాలని కోరారు. మోదీ నాయకత్వంలో తొలిసారి గిరిజన మహిళ దేశ అధ్యక్షురాలు అయిన విషయాన్ని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నడూ ఆదివాసీ మహిళలను రాష్ట్రపతి చేయలేదని, మోదీ వచ్చాక పరిస్థితి మారిందని, ద్రౌపది ముర్ము దేశానికి తొలి పౌరురాలు అయ్యారని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో యూసీసీని బలవంతంగా రుద్దుతున్నారంటూ కాంగ్రెస్ చేస్తున్న ప్రచారంలో నిజం లేదన్నారు. యూసీసీ నుంచి ఆదివాసీ ప్రాంతాలను మినహాయిస్తామని చెప్పారు. పొరుగున్న ఉన్న మేఘాలయాలో చొరబాటుదారులు ఇటీవల గరో హిల్స్ అటానమస్ జిల్లా కౌన్సిల్‌లో గిరిజన మహిళలను పెళ్లాడి రాజకీయ పలుకుబడిని సంపాదించే ప్రయత్నం చేశారని, ఇది ఉద్రిక్తతలకు దారితీసిందని అమిత్‌షా చెప్పారు. అస్సాంలో తమకు మరో ఐదేళ్లు అధికారం ఇస్తే యూజీసీని అమలు చేయడంతో పాటు చొరబాటుదారుల నుంచి రాష్ట్రానికి విముక్తి కల్పిస్తామని భరోసా ఇచ్చారు. అస్సాంలో శాంతిని బీజేపీ పునరుద్ధరించిందని, కాంగ్రెస్ తిరిగి వచ్చినా, కొన్ని సీట్లలో నెగ్గినా కూడా తిరిగి రాష్ట్రంలో అస్థిరత నెలకొంటుందని హెచ్చరించారు. అస్సాం అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఏప్రిల్ 9న జరుగనుండగా, మే 4న ఫలితాలు వెలువడతాయి.


GHMC
hmda Growing Global
TS-bPASS
MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com
SRI SWAMI ASSOCIATES
ARCHITECTS • ENGINEERS • SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissons, LRS, BRS, Tax Assesments
GHMC, HMDA, DTCP, TS-bpass, Layout, Building Permissions
వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.
H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595


క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు



# జీవన మంత్రం: సింప్లిసిటీ!

జీవన ప్రయాణంలో మనిషి నిరంతరం ఒక అన్వేషణలో ఉంటాడు. అది ధనం కోసమో, ధాన్యం కోసమో కాదు కేవలం సంతోషం కోసం. కానీ, ఆ సంతోషం ఎక్కడ ఉంది? ఐదు నక్షత్రాల హోటల్ మెనూలో ఉందా లేక అమ్మ చేతి గోరుముద్దలో ఉందా? ఆకాశహర్మ్యాల పై అంతస్తులో ఉందా లేక పచ్చని చెట్టు నీడన పరుచుకున్న చల్లని గాలిలో ఉందా? ఈ ప్రశ్న నేటి ఆధునిక మానవుడిని వెంటాడుతున్న ఒక మిలియన్ డాలర్ల ప్రశ్న. ఒకప్పుడు మన పెద్దలు సూర్యోదయంతో పాటే నిద్రలేచి, వేపపుల్లతో పళ్ళు తోముకుంటూ, పక్షుల కిలకిలారావాల మధ్య ఒక కప్పు కాఫీ తాగుతూ ముసిముసి నవ్వులు చిందించేవారు. అప్పుడు అరచేతిలో అద్భుతాలు చేసే స్మార్ట్‌ఫోన్‌లు లేవు, అరక్షణంలో వినోదాన్ని పంచే ఓటిటి ప్లాట్‌ఫారమ్‌లు లేవు. అయినప్పటికీ, వారి కళ్ళలో ఒక అనిర్వచనీయమైన తృప్తి, గుండె లోతుల్లో ఒక స్వచ్ఛమైన ప్రశాంతత గోచరించేది.మరి నేడు? మన చుట్టూ అన్నీ సౌకర్యాలే. సెంట్రల్ ఏసీ గదులు, ఖరీదైన కార్లు, బ్రాండెడ్ వస్త్రాలు, విదేశీ విహారయాత్రలు ఇలా భౌతికవాద ప్రపంచం మన ముందు ఒక స్వర్గాన్ని ఆవిష్కరించింది. కానీ, అంతా ఉన్నా ఎక్కడో ఒక వెలితి. గుండె గూటిలో ఏదో తెలియని అశాంతి. మీరు నిజంగా సంతోషంగా ఉన్నారా? అని ఎవరైనా ప్రశ్నిస్తే, సమాధానం చెప్పడానికి పెదవులు తడబడుతున్నాయి. ఇక్కడే అసలు చిక్కు వచ్చి పడింది. నిజమైన సంతోషం అనేది జీవితాన్ని సరళంగా (ూఅఎజూశ్రీఅఎ్ఱఎ) ఉంచుకోవడంలో ఉందా, లేక ఆధునిక పోకడల సంక్లిష్టతలో (జశీఎజూశ్రీవఞఎఎ) ఉందా?నేటి కాలంలో మనం జీవితాన్ని ఒక నిరంతర పందెంలా మార్చుకున్నాం. ఉదయం కళ్ళు తెరవగానే ప్రశాంతతకు బదులు ఒత్తిడి మనల్ని పలకరిస్తుంది. ఏ మెయిల్ వచ్చింది? ఏ ప్రాజెక్ట్ డెడ్ లైన్ దగ్గర పడింది? ఈ నెల ఈఎంఐ (జువీ×) ఎలా కట్టాలి? పిల్లల స్కూల్ ఫీజుల సంగతేంటి? వీటన్నింటికీ తోడు సోషల్ మీడియా అనే ఒక వర్చువల్ ప్రపంచం మనల్ని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టిన ఫోటోకి ఎన్ని లైకులు వచ్చాయి? మన స్టేటస్‌ను ఎందరు చూశారు? పక్కవాడు కొత్త కారు కొంటే మన గుండెల్లో ఎందుకు రైళ్ళు పరిగెడుతున్నాయి? ఈ ఆలోచనలన్నీ మనిషిని ఒక అశాంతి నిలయంగా మార్చేశాయి.ఆర్థిక శాస్త్రవేత్తలు మరియు మనస్తత్వవేత్తలు వివరించే "హెడోనిక్ ట్రెడ్‌మిల్" (నవఎశీఅఱఎ ుతీఎఎఎఱశ్రీశ్రీ) సిద్ధాంతం ఇక్కడ అక్షరాలా నిజమవుతోంది. మనిషి ఏదైనా కొత్త వస్తువును లేదా విజయాన్ని సాధించినప్పుడు తాత్కాలికంగా ఎంతో సంతోషిస్తాడు. కానీ, కొద్ది రోజుల్లోనే ఆ సంతోషం అలవాటైపోయి, మళ్ళీ పాత స్థితికి చేరుకుంటాడు. అప్పుడు అంతకంటే పెద్దది, అంతకంటే ఖరీదైనది కావాలని కోరుకుంటాడు. ఈ పరుగు ఎప్పటికీ ముగియదు. మనం సంతోషం కోసం సంతోషాన్ని తాకట్టు పెట్టి పరుగులు తీస్తున్నామా అనిపించక మానదు. సంక్లిష్టత పెరిగేకొద్దీ, మనిషి తన సొంత అస్తిత్వాన్ని కోల్పోయి, కేవలం ఒక యంత్రంలా మారిపోతున్నాడు.సరళత అంటే పేదరికం కాదు, అలాగే అన్నింటినీ వదిలేసి అడవులకు వెళ్ళిపోవడం అంతకంటే కాదు. సరళత అంటే మన అవసరాలను గుర్తించడం, అనవసరమైన ఆడంబరాలను నిరాకరించడం. ఉన్నదానితో సంతృప్తి చెందడం కాదు, ఉన్నదానిని ఆనందంగా అనుభవించడం.

ఒక్కసారి ఆలోచించండి, తిరుమల గిరుల పైన ఉదయించే సూర్యుడిని చూసినప్పుడు లేదా కడలి తరంగాల హోరును విన్నప్పుడు కలిగే అనుభూతికి ఏ ధనవంతుడైనా వెల కట్టగలడా? దానికి ఏ టికెట్ అవసరం లేదు. వర్షం పడుతున్నప్పుడు మట్టి నుండి వచ్చే ఆ సువాసనను ఆస్వాదించడానికి ఐదు నక్షత్రాల హోటల్ సభ్యత్వం అక్కరలేదు. పసిపాప నిష్కల్మషమైన నవ్వు చూసినప్పుడు మన మనసులో కలిగే ఆ తరంగం అది అద్భుతం. మహాత్మా గాంధీ గారు ఒక సందర్భంలో అద్భుతమైన మాట చెప్పారు.ఆనందం మనం ఏం కలిగి ఉన్నామనే దానిపై ఆధారపడదు, మనం ఎలా ఉన్నామనే దానిపై ఆధారపడుతుంది. బాహ్య ప్రపంచంలోని



వస్తువులు మనకు సౌకర్యాన్ని ఇస్తాయి కానీ, సంతోషాన్ని ఇవ్వలేవు. శాంతి లేని ఐశ్వర్యం ఒక బంగారు పంజరం లాంటిది.హార్వర్డ్ విశ్వవిద్యాలయం దాదాపు 85 ఏళ్ళ పాటు నిర్వహించిన "అడల్ట్ డెవలప్‌మెంట్ స్టడీ" ప్రపంచంలోనే అత్యంత సుదీర్ఘమైన పరిశోధనలలో ఒకటి. ఈ అధ్యయనంలో తేలిన పచ్చి నిజం ఏమిటంటే మనిషి సంతోషానికి, ఆయురారోగ్యాలకు ప్రధాన కారణం డబ్బు, పేరు, ప్రతిష్టలు కాదు. కేవలం నాణ్యమైన సంబంధాలు (Quality Relationships). ఎవరికైతే ఆత్మీయులు ఉంటారో, ఎవరైతే ఇతరులతో ప్రేమను పంచుకుంటారో, వారు అత్యధిక కాలం సంతోషంగా జీవిస్తున్నారని తేలింది. ఈ సంబంధాలు సరళంగా, నిష్కపటంగా ఉన్న చోటే వర్ధిల్లుతాయి. సంక్లిష్టమైన మనస్తత్వాలు, అహకారాలు ఉన్నచోట బంధాలు పేకమేడల్లా కూలిపోతాయి.అలాగే, పాజిటివ్ సైకాలజీ పితామహుడు మార్టిన్ సెలిగ్మ్యాన్ ప్రకారం, మనిషికి "ఫ్లో" (Flow) అనే స్థితిలో అత్యున్నత ఆనందం కలుగుతుంది. అంటే, ఒక పనిలో తన్మయత్వంతో నిమగ్నమవ్వడం. ఇది మనం చేసే పని సరళంగా ఉండి, మన మనసుకు నచ్చినప్పుడే సాధ్యమవుతుంది.మన తెలుగు సంస్కృతి పునాదులే సరళతపై నిర్మితమయ్యాయి. సంతోషమే సగం బలం అని మన పెద్దలు ఊరకే అనలేదు. వేమన పద్యాల్లోని నిగూఢార్థం గమనిస్తే, ఆడంబరం లేని జీవితమే ఆదర్శమని బోధిస్తుంది.అల్పుడెపుడు బల్కు ఆడంబరముగాను, సజ్జనుండు బల్కు చల్లగాను.అన్న వేమన వాక్కు నేటికీ శిరోధార్యం. తక్కువతో ఎక్కువ జీవించడం మన వారసత్వం. బమ్మెర పోతన వంటి మహాకవులు రాజభోగాలను తిరస్కరించి, హాలంతో పొలాన్ని దున్నుతూ, కలంతో భాగవతాన్ని లిఖించి ధన్యులయ్యారు. వారి రచనల్లో ఉన్న మాధుర్యం, ఆ సరళత వల్లే నేటికీ మన గుండెల్లో సజీవంగా ఉంది.

నేటి తరం సోషల్ మీడియాలో పర్ఫెక్ట్ లైఫ్ ప్రదర్శించే క్రమంలో తీవ్రమైన ఒంటరితనానికి గురవుతోంది. ప్రపంచమంతా కనెక్ట్ అయి ఉన్నాం అనుకుంటాం కానీ, పక్కన ఉన్న మనిషితో మనసు విప్పి మాట్లాడలేకపోతున్నాం. ఈ క్రమంలో మనం జపాన్ తత్వశాస్త్రమైన "ఇకిగాయ్" (×ఱఆఱస్త్రaఱ) గురించి తెలుసుకోవాలి. ఇకిగాయ్ అంటే జీవన పరమార్థం . మీకు ఇష్టమైన పని.మీరు ప్రావీణ్యం ఉన్న పని.ప్రపంచానికి అవసరమైన పని.మీకు ఆదాయాన్నిచ్చే పని. ఈ నాలుగింటి కలయికే ఇకిగాయ్. ఇది చాలా సరళమైన సూత్రం. మన జీవితంలో ఈ సమతుల్యత సాధిస్తే, సంక్లిష్టతలు తొలగిపోయి సంతోషం సిద్ధిస్తుంది.అయితే, సంక్లిష్టత అంటే కేవలం చెడు అని భావించకూడదు. మానవ నాగరికత వికాసానికి, మేధో సంపత్తికి సంక్లిష్టమైన సవాళ్ళు అవసరం. ఒక శాస్త్రవేత్త ఏళ్ళ తరబడి చేసే ప్రయోగం, ఒక ఇంజనీర్ నిర్మించే అద్భుత కట్టడం వెనుక ఎంతో సంక్లిష్టత ఉంటుంది. కానీ ఆ సంక్లిష్టతలో సృజనాత్మకత ఉన్నప్పుడు అది ఆనందాన్ని ఇస్తుంది. సమస్య ఎక్కడ వస్తుందంటే, బాహ్య ప్రపంచం మనపై రుద్దే అనవసరపు పోలికలు, ఒత్తిడి వల్ల కలిగే సంక్లిష్టత మనల్ని కుంగదీస్తుంది. అందుకే, స్వేచ్ఛగా ఎంచుకున్న కష్టమైన లక్ష్యమైనా లేదా ఇష్టంగా స్వీకరించిన సరళమైన జీవితమైనా సరే... మనసులో ప్రశాంతత ఉంటే రెండూ అద్భుతమే.ఈ అక్షర యానం ముగించే ముందు ఒక్క క్షణం కళ్ళు మూసుకుని ఆలోచించండి. గత వారం రోజుల్లో మీరు మనస్ఫూర్తిగా నవ్వుకున్న సందర్భం ఏది? అది ఖచ్చితంగా ఏదో ఒక చిన్న విషయమే అయి ఉంటుంది. పాత స్నేహితుడి పలకరింపు, ఆకలితో ఉన్న జీవికి పెట్టిన అన్నం, లేదా చల్లని సాయంత్రం వేళ ఏకాంతంగా విన్న పాట. ఈ క్షణాలన్నీ అత్యంత సరళమైనవి. వీటికి హోదా అక్కరలేదు, బ్యాంక్ బ్యాలెన్స్ అవసరం లేదు.నిజమైన సంతోషం అనేది ఒక గమ్యం కాదు, అది ఒక ప్రయాణం. అది మన బయట ఎక్కడో లేదు, మన లోపలే నిద్రాణమై ఉంది. దానిని మేల్కొల్పడానికి మనం చేయవలసిందల్లా ఒక్కటే అనవసరమైన పరుగును ఆపి, మన చుట్టూ ఉన్న చిన్న చిన్న అద్భుతాలను గమనించడం. జీవితాన్ని సంక్లిష్టతల నుండి సరళత వైపు మళ్ళించడం. అప్పుడే మన జీవితం ఒక పరిమళించే సుమమై, అందరికీ ఆనందాన్ని పంచుతుంది.

డా .సూర్యదేవర రామకృష్ణ ,
9490754169



## ఇబ్రహీంపట్నంలో ఏవీఎన్ లేక్ ఫీల్డ్ గ్లోబల్ స్కూల్ ఘన ప్రారంభం

**ఇబ్రహీంపట్నం, క్రైమ్ మిర్రర్ :** ఇబ్రహీంపట్నంలో ఏవీఎన్ లేక్ ఫీల్డ్ గ్లోబల్ స్కూల్ ను శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమం ఎంతో వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. వారిలో కేంద్రమంత్రి గంగాపురం కిషన్ రెడ్డి, కౌన్సిల్ చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మెదక్ ఎంపీ రఘునందన్ రావు, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి, కామారెడ్డి ఎమ్మెల్యే తాటిపల్లి వెంకట్ రమణా రెడ్డి, నిజామాబాద్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, ఎమ్మెల్సీలు కొమురయ్య, అంజి రెడ్డి తదితరులు ఉన్నారు. ఏవీఎన్ స్కూల్ ఫౌండర్ చైర్మన్ ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా పాఠశాల సౌకర్యాలను పరిశీలించిన ముఖ్యమంత్రి, నాణ్యమైన విద్య అందించడంలో ఇలాంటి విద్యాసంస్థలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే పారదర్శకమైన పాలన : యేల్మేటి అమరేందర్ రెడ్డి



**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్):** బడంగ్‌పేట్ సర్కిల్ కార్యాలయంలో జరిగిన అవినీతి అక్రమాలను కాంగ్రెస్ పార్టీకి అంటగట్టి బురదజల్లే ప్రయత్నం చేస్తే సహించేది లేదని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, పిసిసి కార్యదర్శి యేల్మేటి అమరేందర్ రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ కొన్ని పత్రికల్లో వస్తున్న అసత్య కథనాలను తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే "ప్రజాపాలన" అని, ఎక్కడ అవినీతి జరిగినా తమ ప్రభుత్వం పారదర్శకమైన విచారణకు కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. బడంగ్‌పేట్ సర్కిల్ అధికారుల సస్పెన్షన్ వ్యవహారంలో విజిలెన్స్ మరియు ఏసీబీ విచారణ సజావుగా సాగుతోందని, ఇందులో రాజకీయ జోక్యం లేదని వారు తెలిపారు.బడంగ్‌పేట్ నగర పంచాయతీగా ఉన్నప్పటి నుండి, మున్సిపల్ కార్పొరేషన్‌గా మారి అనంతరం జిహెచ్ఎంసి లో విలీనం అయ్యే వరకు జరిగిన అన్ని వ్యవహారాలపై సమగ్ర జ్యుడీషియల్ విచారణ జరిపించాలనీ, అవినీతికి పాల్పడింది ఏ పార్టీ వారైనా, ఎంతటి వారైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఉపేక్షించబోదని వారు తేల్చి చెప్పారు.నిజ నిజాలు బయటపడితే ఎవరు దోషులో ప్రజలకు స్పష్టంగా తెలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎల్మేటి అమరేందర్ రెడ్డి, సామెడి గోపాల్ రెడ్డి, బోయపల్లి గోవర్ధన్ రెడ్డి, ఆనంద్ రెడ్డి, సుభాన్ యాదవ్, స్వాగత్ శ్రీనివాస్, బంగారు అశోక్, క్యారగారి శ్రీధర్, చరణ్ రెడ్డి, స్వామి నాయక్, వరికుప్పల శివ, చిర్ర రాజు, మహిళా నాయకురాలు అమృత నాయుడు, పద్మశ్రీ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా నిర్వహించిన దొడ్డి కొమురయ్య 99వ జయంతి వేడుకలు

**క్రైమ్ మిర్రర్, ఆత్మకూరు(ఎం) ఏప్రిల్ 3:** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరవీరుడు దొడ్డి కొమురయ్య 99వ జయంతి వేడుకలను హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ప్రభుత్వ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో దొడ్డి కొమురయ్య వారసుడు దొడ్డి చంద్రం, ఆత్మకూరు(ఎం)మండలం ఉప్పలపాడు గ్రామ సర్పంచ్ చిన్నం బీరప్ప, ఆత్మకూరు గ్రామ ఉపసర్పంచ్ మజ్జిగ నరేష్ కురుమ,మజ్జిగ రాంబాబు కురుమ,కేమిడి రమేష్, తదితరులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు దొడ్డి కొమురయ్య త్యాగాలను స్మరించుకుంటూ వారికి ఘన నివాళులు అర్పించారు.




## ఘనంగా కురుమ సంఘం భవనంలో దొడ్డి కొమురయ్య 99వ జయంతి



**క్రైమ్ మిర్రర్, ఆత్మకూరు(ఎం) ఏప్రిల్ 3:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం శుక్రవారం రోజు కురుమ సంఘం భవనంలో సంఘం అధ్యక్షులు కోరే లక్ష్మణ్ అధ్యక్షతన తెలంగాణ తొలి అమరులు దొడ్డి కొమురయ్య 99వ జయంతి కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది.ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ బీసు ధనలక్ష్మి చందర్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరైన సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ అమరవీరుల ఆశయాలు ఆకాంక్షలను నెరవేర్చుకోవాలని మరియు త్వరలోనే మండల కేంద్రంలో దొడ్డి కొమురయ్య విగ్రహ ప్రతిష్ట చేయగలమని తెలియచేసినారు.ఈ కార్యక్రమంలో మండల కురుమ సంఘం అధ్యక్షులు కోరె బిక్షపతి, మరియు గ్రామం మాజీ సర్పంచ్ టిఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షులు బీసు చందర్ గౌడ్, మరియు గ్రామ మాజీ సర్పంచ్ జన్నాయి కోడే నగేష్, మండల టిఆర్ఎస్ మహిళా విభాగం అధ్యక్షురాలు సోలిపురం అరుణ, బిజెపి జిల్లా నాయకులు బండారు సత్యనారాయణ, సిపిఎం గ్రామ శాఖ అధ్యక్షులు రాచమల్ల సత్తయ్య, సిపిఐ గ్రామ శాఖ అధ్యక్షులు మజ్జిగ నరసయ్య, బిజెపి గ్రామ శాఖ అధ్యక్షులు లోడి వెంకటయ్య, సుల్తాన్ పురుషోత్తం,ఎలగందుల శ్రీనివాస్,పెద్ద కురుమ బండ చంద్రయ్య, కురుమ సంఘం మాజీ అధ్యక్షులు కోరే కనకయ్య, కోరే బీరయ్య, మరియు కోరే బీరప్ప ,మజ్జిగ మల్లయ్య, మజ్జిగ అశోక్, మజ్జిగ శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.



## ఛత్రపతి శివాజీ మహారాజ్ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు

**క్రైమ్ మిర్రర్, ఆత్మకూరు(ఎం) ఏప్రిల్ 03:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం శుక్రవారం రోజు మండల కేంద్రంలో శివాజీ యువజన మండలి ఆధ్వర్యంలో ధైర్యానికి, దేశభక్తికి, వీరత్వానికి నిదర్శనం అయిన ఛత్రపతి శివాజీ మహారాజ్ వర్ధంతి సందర్భంగా, ఆయన చేసిన త్యాగాలను స్మరించుకుంటూ శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది.ఈ కార్యక్రమంలో యువజన మండలి ప్రధాన కార్యదర్శి తొండల అనిల్ కుమార్ గౌడ్, మాజీ అధ్యక్షులు కోరే మల్లేష్, ఉపాధ్యక్షులు మోలుగూరి రాజు, మల్ల క్రాంతి, రంగ శ్రీను,బుషిగంపల శివ నారాయణ యువజన మండలి సభ్యులు రాగటి సత్యనారాయణ, మొలుగూరి కరుణాకర్, తవిటి వెంకన్న, సూరారం రాము, పంజాల కాశీనాథ్, దిగోజు రమేష్ చారి, కోరే అశోక్,యాస గోవర్ధన్ రెడ్డి, బండ శివాజీ, కోరే రాజు, కోరే మహేష్, లోడి మధు, లోడి మణికంత, కోరే ప్రశాంత్, మజ్జిగ శివ, పంజాల శివ సాయి, సూరారం భాను, దొంతి శివ,పంజాల శివ తదితరులు పాల్గొన్నారు.



# ఏప్రిల్ 'ఫూల్స్' నెల కాదు..
# ఇది సామాజిక విప్లవకారుల 'జ్ఞాన' మాసం

## తెలంగాణ రాష్ట్ర మూడనమ్మకాల నిర్మూలన సంఘం యూత్ జాయింట్ సెక్రటరీ గుర్రాల నాగరాజు

**క్రైమ్ మిర్రర్, ఆత్మకూరు(ఎం) ఏప్రిల్ 3:** ప్రతి ఏటా ఏప్రిల్ నెల రాగానే 'ఏప్రిల్ ఫూల్' అంటూ ఒకరినొకరు మోసం చేసుకోవడం, వెక్కిరించుకోవడం ఒక అశాస్త్రీయ ఆచారంగా మారిపోయింది. కానీ, చరిత్రను లోతుగా పరిశీలిస్తే.. ఈ ఏప్రిల్ నెల భారతదేశ సామాజిక ముఖచిత్రాన్ని మార్చిన మహోన్నత వ్యక్తుల జన్మదినాలతో పునీతమైంది. మూఢనమ్మకాల చీకట్లను చీల్చి, అణగారిన వర్గాల జీవితాల్లో విజ్ఞానపు వెలుగులు నింపిన మహనీయులు పుట్టిన ఈ నెలను మనం 'సామాజిక చైతన్య మాసం'గా జరుపుకోవాలి.

**"ఏప్రియల్ నెలలోని సామాజిక విప్లవమూర్తులు"**

1.బాబు జగ్‌జీవన్ రామ్ జయంతి (ఏప్రిల్ 5)అట్టడుగు వర్గాల నుండి ఎదిగి, దేశ రక్షణ మరియు వ్యవసాయ రంగాల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చిన ధీశాలి బాబూజీ. కుల వివక్షను ఎదిరించి, సమసమాజ స్థాపన కోసం ఆయన చేసిన కృషి నేటికీ ఆదర్శం.

2.మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి (ఏప్రిల్ 11) భారతదేశంలో సామాజిక విప్లవానికి ఆద్యుడు జ్యోతిరావు పూలే. అంటరానితనం, మూఢాచారాలపై ఆయన చేసిన పోరాటం నిరుపమానం. "విద్య లేనివాడు వివేకం కోల్పోతాడు" అని చాటిచెప్పిన ఆయన, స్త్రీ విద్య కోసం మొట్టమొదటి పాఠశాలను ప్రారంభించిన యుగపురుషుడు. 3.డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి (ఏప్రిల్ 14)భారత రాజ్యాంగ







నిర్మాత, ఆధునిక భారత నిర్మాణ శిల్పి బాబాసాహెబ్ అంబేద్కర్ జన్మించింది కూడా ఈ నెలలోనే. జ్ఞానానికి నిలువెత్తు రూపమైన ఆయన, కోట్లాది మంది జీవితాల్లో ఆత్మగౌరవాన్ని నింపారు. "బోధించు, సమీకరించు, పోరాడు" అనే నినాదం నేటికీ మన హేతువాద ఉద్యమాలకు ఊపిరి."మనం మార్చుకోవాల్సిన దృక్పథం" ఒకవైపు ఇంతటి మహనీయుల స్ఫూర్తి ఉంటే, మరోవైపు సమాజం ఏప్రిల్ 1ని అజ్ఞానంతో 'ఫూల్స్ డే'గా జరుపుకోవడం విచారకరం. మూఢనమ్మకాల నిర్మూలన సంఘం కార్యకర్తలుగా మన బాధ్యత ఏంటంటే.. ప్రజల్లో ఈ అశాస్త్రీయ భావజాలాన్ని తొలగించడం. ఏప్రిల్ నెలను అజ్ఞానానికి ప్రతీకగా కాకుండా, అంబేద్కరిజం, పూలే ఆశయాల సాక్షిగా 'విజ్ఞాన మాసం'గా గుర్తించాలి.

**"ఏప్రియల్ మాసం అంటే జ్ఞాన మాసం అని గుర్తించుకుందాం"**



మహనీయులు మనకు అందించిన అతిపెద్ద ఆయుధం 'శాస్త్రీయ దృక్పథం'. ఈ ఏప్రిల్ నెలలో వారిని స్మరించుకుంటూ.. సమాజంలో పేరుకుపోయిన కులతత్వం, మతతత్వం, మూఢనమ్మకాలను పారద్రోలి, ఒక సమ సమాజాన్ని నిర్మించడానికి మనమంతా కంకణం కట్టుకుందాం. అప్పుడే ఈ నెలకు, ఆ మహనీయుల జన్మదినాలకు నిజమైన సార్థకత లభిస్తుంది అని అంటున్న గుర్రాల నాగరాజు.

# సలేశ్వరం జాతరను మరో రెండు రోజులు పొడగించాలి

## మాజీ సర్పంచ్ ఎముక జంగయ్య

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** అత్యంత మహిమాన్విత క్షేత్రమైన మరో అమరనాథ్ యాత్రగా పిలవబడే సలేశ్వరం జాతరను మరో రెండు రోజులు పొడగించాలని నాగర్ కర్నూలు జిల్లా కల్వకుర్తి మండలం జిల్లెల్ల మాజీ సర్పంచ్ ఎముక జంగయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. తెలంగాణ రాష్ట్రంతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్నాటక, తమిళనాడుతో పాటు రెండు తెలుగు రాష్ట్రాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారి దర్శణార్ధం వస్తుంటారని అన్నారు. భక్తుల రద్దీ ఎక్కువ కావడం, రోజులు తక్కువ ఉండడంతో స్వామివారిని దర్శంచుకోలేక వెనుదిరుగుతున్నారన్నారు. మూగజీవాలకు, పర్యావరణ ప్రకృతికి విఘాతం కలుగకుండ అందరు భక్తులు దర్శించుకునేలా చూ డాలని, అలాగే ఎన్నో వ్యయప్రయాసాలకు ఓర్చి వచ్చిన భక్తులపై పోలీసులు లాఠీఛార్జి చేయడం బాదకరమని, గతంలో కూడా శ్రీశైలం పుణ్యక్షేత్రంలో, కేరళలోని అయ్యప్పస్వామి క్షేత్రంలో భక్తులపై పోలీసులు లాఠీఛార్జి చేయడం బాధాకరమన్నారు. భక్తులకు సరైన వసతులు కల్పించి, వారికి ఇబ్బందులు కలుగకుండ అద్యాత్మికతను అందించే బాధ్యత ప్రభుత్వాని దేనని, భక్తులు కంట్రోల్ కావడం లేదని లాఠీచార్చి చేయడం ఎంటని ప్రశ్నించారు. గతంలో ఈ యాత్ర 9 రోజులు, ఆ తర్వాత 5 రోజులు, ఇప్పుడు 3 రోజులకు కుదించడం భక్తుల మనోభావాలకు ఇబ్బందులు కలిగించడమేనని అన్నారు.



అలాగే ఫారెస్టు అధికారులు ఒక్కొ వాహనం నుండి 500 రూపాయలు టోల్ ఫీజు వసూళ్లు చేశారని, భక్తుల దగ్గర ఒక్కొక్కరికి 30 రూపాయలు వసూలు చేశారని, కానీ సౌకార్యాలు మాత్రం గతంలో మాదిరిగానే ఉన్నాయని. అభివృద్ధి లేదన్నారు. ఆలయాల దగ్గర భక్తుల మనోభావాలకు ఇబ్బం దులు కలిగిస్తే చూస్తు ఊరుకోబోమని ఆయన హెచ్చరించారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని సలేశ్వరం జతరను మరో రెండు రోజులు పొడిగించాలని ప్రభుత్వాన్ని కోరారు.

# బడిబాట కార్యక్రమంలో వెల్లంకి ఉపాధ్యాయులు



**క్రైమ్ మిర్రర్, ఆత్మకూరు(ఎం) ఏప్రిల్ 3:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం వెల్లంకీ గ్రామ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని శుక్రవారం రోజు గుడ్ ఫ్రైడే సెలవు అయినప్పటికీ కూడా విద్యార్థులతో కలిసి నిర్వహించడం జరిగింది. ముందుగా బడిబాట కార్యక్రమం యొక్క కరపత్రమును గ్రామ సర్పంచ్ ఇడెం రాధా శ్రీనివాస్ మరియు కరపత్ర దాతలు బత్తుల శ్రీనివాస్ ,ఏఏపీసీ చైర్ పర్సన్ పులగం సులోచన,పాఠశాల ప్రధానోపాధ్యాయులు పల్లె మోహన్ రెడ్డిలు సంయుక్తంగా ఆవిష్కరించడం జరిగింది. తదుపరి బడిబాట కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ప్రతి ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలలో వారి పిల్లలను చేర్పించాలని కోరడం జరిగింది. వారి నుండి మంచి స్పందన రావడం జరిగింది. వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఈడెం రాధా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విలువైన ఉచిత విద్య లభిస్తుందని తెలియజేయడం జరిగింది. అదేవిధంగా ప్రతి తల్లిదండ్రులు ఆలోచించి మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి పాఠశాల బలోపేతానికి సహకరించాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఇట్టే సోమిరెడ్డి, ఉయ్యాల బిక్షమయ్య, దూదిగామ సువర్ణ,మందుగుల వెంకటయ్య,కొసన మాధవి, నకిరేకంటే అశ్విని పాల్గొనడం జరిగింది.





# గౌరారం గ్రామంలో ఘనంగా కుస్తీ పోటీలు

## చివరి కుస్తీ పోటీలో గెలుపొందిన మల్ల యోధునికి రూ.3,100 నగదును అందజేసిన గ్రామ సర్పంచ్

**పిట్లం క్రైమ్ మిర్రర్ న్యూస్ :** కామారెడ్డి జిల్లా పిట్లం మండలం గౌరారం గ్రామంలో హనుమాన్ జయంతినీ పురస్కరించుకొని శుక్రవారం కుస్తీ పోటీలను గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.గురువారం రథోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.కుస్తీ పోటీలను తిలకించడానికి చుట్టుపక్కల గ్రామ ప్రజలు తరలివచ్చి వీక్షించారు.కుస్తీ పోటీలలో పాల్గొనడానికి జుక్కల్,మద్నూర్,బిచ్కుంద,బాన్సువాడ,పిట్లం తదితర ప్రాంతాల నుండి మల్లయోధులు తరలివచ్చి కుస్తీ పోటీలలో పాల్గొన్నారు.కుస్తీ పోటీలు ఆసక్తికరంగా సాగాయి.చివరి కుస్తీ పోటీలో గెలుపొందిన మల్ల యోధునికి రూ.3,100 నగదును గ్రామ సర్పంచ్ లోకినేని హన్మంత్ రావు పటేల్ చేతుల మీదుగా అందజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ దొడ్లే హనుమాన్లు,మాజీ సర్పంచ్ అనసూయ శంకర్,గ్రామ పెద్దలు జూపాల శంకర్,ఎస్ రాములు, బి.సాయిలు,రాజేష్,రాజు,ఎల్లయ్య,బైరీ లక్మగౌడ్,సాయి గోండ,మహేష్ గుప్తా,గొల్ల మారుతి,కడల సంతు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# దొడ్డి కొమురయ్య 99 వ జయంతి ఉత్సవాలలో పాల్గొన్న సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి




**సంస్థాన్ నారాయణపురం, ఏప్రిల్ 03(క్రైమ్ మిర్రర్):** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలు సంస్థాన్ నారాయణపూర్ మండలం కేంద్రంలో బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి గణం నర్సింహ కురుమ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించరు. ఈ కార్యక్రమని ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి హాజరై దొడ్డి కొమురయ్య విగ్రహనికి పూలమాల వేసి జయంతి వేడుకలలో పాలుగోన్నారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ నాడు భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం వీరోచితంగా పోరాడిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య జయంతి సందర్భంగా ఆమహనీయునికి ఘన నివాళులు అర్పిస్తున్నాం అని అన్నారు .ఈ కార్యక్రమం లో మాజీ సర్పంచ్ కొన్ రెడ్డి నర్సింహ, ఉపసర్పంచ్ పల్లె మల్లారెడ్డి, మాజీ ఎంపీటీసీ బచ్చనగోని గాలయ్య యాదవ్,కుమ్మరి హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు సిలివేరు అంజయ్య, సిపిఐ పార్టీ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, కొత్తగూడెం గ్రామ పంచాయతీ వార్డ్ మెంబర్ గణం శివ శంకర్, కలకొండ సంజీవ, పల్లె గోపాల్ రెడ్డి, శికిలమెట్ల ప్రభాకర్, బైకని నరేంద్ , రహీమ్ షరిప్, మందుగుల బాలకృష్ణ, పాశం రాములు ,గునిగంటి రాజు, ఇదే మల్లయ్య, కొండ రవి,రసాల యదయ్య, వడ్డే పల్లి శివప్రసాద్,ఎండీ అర్షద్ , తదితరులు పాల్గొన్నారు

# మంత్రి జూపల్లిని కలిసిన పర్యాటక ఎండి గౌతమి

హైదరాబాద్:పర్యాటక, సాంస్కృతిక శాఖ స్పెషల్ సీఎస్ గా ఇటీవల నియమితులైన వాణి ప్రసాద్, అలాగే పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన పి. గౌతమి శుక్రవారం డా. బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో మంత్రి జూపల్లి కృష్ణారావును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు.. వారికి శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేశారు. రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాలని, పర్యాటక ప్రాంతాల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, నూతన ప్రాజెక్టులపై దృష్టి సారించాలని ఈ సందర్భంగా అధికారులకు దిశానిర్దేశం చేశారు.

క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు
కంటెంట్ రైటర్లు కావలెను
సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం



తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.

క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.

తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.

న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.

స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి, ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.

సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజ్ కోసం.

సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.

ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.


9393929595

# అమరవీరుడు దొడ్డి కొమరయ్య ఆశయ సాధనే లక్ష్యం

## బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి గణం నర్సింహ కురుమ



**సంస్థాన్ నారాయణపురం, ఏప్రిల్ 03(క్రైమ్ మిర్రర్ ):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలో దొడ్డి కొమురయ్య విగ్రహం వద్ద బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి గణం నర్సింహ కురుమ ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య కురుమ 99 వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, బీసీ సంఘం నాయకులు, కురుమ సమాజ ప్రతినిధులు, యువత, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని దొడ్డి కొమురయ్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళు లు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ....దొడ్డి కొమురయ్య కురుమ తెలంగాణ రైతాంగ సాయిదా పోరాటంలో తొలి అమరుడు గా చరిత్రలో నిలిచారని తెలిపారు. రైతుల హక్కులు సామాజిక న్యాయం సమానత్వం కోసం చేసిన పోరాటం తరతరాలకు ఆదర్శమని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన తొలి దశ మలిదశ ఉద్యమం దొడ్డి కోమరయ్య పోరాటం స్ఫూర్తితో సాగిందని అన్నారు. ఆయన ఆశయాలనుముందుకు తీసుకువెళ్లడం ప్రతి ఒక్కరు బాధ్యత అని అన్నారు. అనంతరం ఆయన జీవిత చరిత్ర, తెలంగాణ రైతాంగ పోరాటంలో చేసిన త్యాగం, అణగారిన వర్గాల కోసం చేసిన పోరాటాన్ని స్మరించుకున్నారు. దొడ్డి కొమురయ్య బహుజన సమాజానికి గర్వకారణమని, ఆయన చూపిన పోరాట స్ఫూర్తి నేటి యువతకు ఆదర్శమని పేర్కొన్నారు. సమాన హక్కులు, సామాజిక న్యాయం, అణగారిన వర్గాల అభివృద్ధి కోసం ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. దొడ్డి కొమురయ్య త్యాగాలను స్మరించుకుంటూ బిసి సంక్షేమ సంఘం ఎల్లప్పుడూ అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడుతుందని గణం నర్సింహ కురుమ తెలిపారు. దొడ్డి కొమురయ్య అమరుడికి జోహార్లు అంటూ నినాదాలు చేశారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా నారాయణపురం గ్రామ సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి, ఉపసర్పంచ్ పల్లె మల్లారెడ్డి, మాజీ సర్పంచ్ కోన్ రెడ్డి నర్సింహ, మాజీ ఎంపీటీసీ బచ్చనగోని గాలయ్య యాదవ్, కుమ్మరి హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు సిలివేరు అంజయ్య, సిపిఐ పార్టీ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, కొత్తగూడెం గ్రామ పంచాయతీ వార్డ్ మెంబర్ గణం శివ శంకర్, కలకొండ సంజీవ, పల్లె గోపాల్ రెడ్డి, శికిలమెట్ల ప్రభాకర్, బైకన్ నరేందర్ యాదవ్, రహీమ్ షరిప్, మందుగుల బాలకృష్ణ, పాశం రామ్, గునిగంటి రాజు, ఇదే మల్లయ్య, కొండ రవి, రాసాల యాదయ్య, వడ్డేపల్లి ప్రసాద్, హర్షద్ధ, తదితరులు పాల్గొన్నారు.



## నేటి తరం యువత ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజ సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలి : సాయి మల్లిక్

**గండిపేట్ : ( క్రైమ్ మిర్రర్ ):** హిందూ స్వరాజ్య స్థాపకుడు, ఛత్రపతి శివాజీ మహారాజ్ 346వ వర్ధంతి వేడుకలను అత్తాపూర్ పరిధిలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అత్తాపూర్ ఎంక్యూబ్ మాల్ సమీపంలోని శివాజీ మహారాజ్ విగ్రహానికి శ్రీనివాస సేవా సమితి చైర్మన్, సామాజిక కార్యకర్త పెండ్యాల సాయి మల్లిక్ పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. దఈ సందర్భంగా పెండ్యాల సాయి మల్లిక్ మాట్లాడుతూ.. శివాజీ మహారాజ్ చూపిన ధైర్యసాహసాలు, దేశభక్తి ఎప్పటికీ మరువలేనివ న్నారు. అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడి, ధర్మాన్ని కాపాడిన మహోన్నత వీరుడు శివాజీ అని కొనియాడారు. నేటి తరం యువత ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజ సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని పిలుపునిచ్చారు. ?ఈ కార్యక్రమంలో బాలు, శ్రీకాంత్, మరియు శ్రీనివాస సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

## ఏప్రిల్ 5 న లయన్స్ జిల్లా 320ఎ కన్వెన్షన్

### జిల్లా గవర్నర్ గడ్డం మహేంద్ర కుమార్ రెడ్డి



**క్రైమ్ మిర్రర్, కల్వకుర్తి:** లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ జిల్లా 320ఏ పదవ వార్షిక కన్వెన్షన్ ఏప్రిల్ 5న శంషాబాద్ లోని అతిథి కన్వెన్షన్ లో నిర్వహించడం జరుగుతుందని జిల్లా గవర్నర్ డా .గడ్డం మహేంద్ర కుమార్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ ఏడాది చనిపోయిన లయన్ సభ్యులకు నివాళులర్పించే కార్యక్రమం ఉంటుందని చెప్పారు. ఆ తర్వాత అన్ని క్లబ్బుల సర్వీస్ ఆక్టివిటీస్ ల సమర్పణ కార్యక్రమం బ్యానర్ ప్రజెంటేషన్ జరుగుతుందని పేర్కొన్నారు. దాని తర్వాత ఇనాగరల్ సెషన్ ఉంటుందని, దాని తర్వాత బిజినెస్ సెస్సన్ ఉంటుందని, ఇందులో వచ్చే లయన్స్టిక్ సంవత్సరానికి కొత్త టీం ను ఎన్నుకోవడానికి ఎలక్షన్స్ ఉంటాయని, తరువాత ఎలక్షన్ రిజల్ట్స్ వెల్లడించి కొత్త టీం తో వారి అంగీకార ఉపన్యాసాలు ఉంటాయని, గవర్నర్ ఈ సందర్భంగా చెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇంటర్నేషనల్ డైరెక్టర్ లయన్ మగేష్ వస్తున్నారని, ప్రత్యేక అతిథులుగా లయన్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్ పర్సన్ జి.బాబురావు గ్యాట్ ఏరియా లీడర్ అర్. సునీల్ కుమార్ హాజరవుతున్నారని జిల్లా ముఖ్య సలహాదారు పిడిజి జి. చెన్న కిషన్ రెడ్డి చెప్పారు. ఈ 10వ జిల్లా కన్వెన్షన్ కు చైర్మన్ గా మల్టిపుల్ కౌన్సిల్ మాజీ చైర్మన్ లయన్ సందడి నరేందర్ రెడ్డి, కో చైర్మన్గా మాజీ జిల్లా గవర్నర్ జూలూరి రఘు, కార్యదర్శిగా శరత్ చంద్ర బాబు, కోశాధికారిగా ఎం.వి.చారి, జాయింట్ సెక్రటరీగా హరిదర్శన్ సాలికే ,కోఆర్డినేటర్ గా పి. రమేష్ చంద్రబాబు ఉన్నారని చెప్పారు. జిల్లా క్యాబినెట్ కార్యదర్శి తాళ్ల అంజయ్య, జిల్లా క్యాబినెట్ కోశాధికారి బి.ఆర్. రామ్ రెడ్డి, రీజియన్ చైర్పర్సన్ సంపతి జనార్ధన్ రెడ్డి, జోన్ చైర్మన్ జూలూరి లింగయ్య, క్లబ్ అధ్యక్షులు గోవర్ధన్ రెడ్డి, కార్యదర్శి గంప శ్రీను, కోశాధికారి జి. శ్రీనివాస్ రెడ్డి,పిఆర్ఓ ఎండి పాషా పాల్గొన్నారు.

## బాబూ జగ్జీవన్ రామ్ జయంతి ఉత్సవానికి ఎమ్మెల్యే పోచారంకు ఆహ్వానం



**బాన్సువాడ క్రైమ్ మిర్రర్ న్యూస్:** కామారెడ్డి జిల్లా బాన్సువాడ నియోజకవర్గ కేంద్రంలో ఈ నెల 5వ తేదీన నిర్వహించే బాబూ జగ్జీవన్ రామ్ జయంతి ఉత్సవాలలో పాల్గొనాలని ఆ సంఘం నాయకులు శుక్రవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డిని కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సంఘం డివిజన్ అధ్యక్షులు దొబ్బల గంగాధర్ మాట్లాడుతూ....బాన్సువాడ పట్టణంలోని 5వ తేదీన పాత బాన్సువాడ నుండి భారీ ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు కాదేపురం గంగన్న,ఎర్రవట్టి పోషిరాం,మారుశెట్టి హన్మాండ్లు,కోటగిరి సతీష్, ముక్కగల్ల ప్రసాద్,కూడుగొల్లా రమేష్,ఎర్రోళ్ల అశోక్,ఎడ్ల మహేష్,డప్పు రమేష్,సింగని రవి వర్మ, ముద్రగల్ల శివ కుమార్,శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## చేనేత కార్మికుల ఉపాధిని దెబ్బ తీయొద్దు

### 105 కోట్ల టెండర్ రద్దుతో ఉపాధి లేకుండా పోతుంది

### రాష్ట్ర చేనేత ఐక్య వేదిక మీడియా కార్యదర్శి లింగమూర్తి





**వరంగల్ (క్రైమ్ మిర్రర్):** ప్రభుత్వం ఏటా టెస్కో (తెలంగాణ చేనేత సహకార సంఘం)కు ఇచ్చే ఆర్డర్లను రద్దు చేయడం సమంజసం కాదని రాష్ట్ర చేనేత ఐక్య వేదిక మీడియా కార్యదర్శి లింగమూర్తి అన్నారు. ఈ మేరకు శుక్రవారం వరంగల్ జిల్లా కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ తీరుపై అసహనం వ్యక్తం చేశారు. 2026 - 27 విద్యా సంవత్సరంలో విద్యార్థులకు యూనిఫామ్ తయారీ కోసం టెస్కోకు ఇచ్చే 105.54 కోట్ల ఆర్డర్ను రద్దు చేయడం అంటే చేనేత కార్మికుల ఉపాధిని దెబ్బ కొట్టడమే అని పేర్కొన్నారు. అలాగే వివిధ సంక్షేమ శాఖల నుంచి వచ్చే ఆర్డర్లను సైతం ఇవ్వకపోవడంతో చేనేత కార్మికులు ఆందోళన చెందుతున్నారన్నారు. దశాబ్దాలుగా విద్యాశాఖ, సంక్షేమ శాఖల పరిధిలోని విద్యార్థులకు దుస్తులు కుట్టిచ్చే బాధ్యతను చేనేత సహకార సంఘమే చూస్తుండగా ప్రస్తుతం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో చేనేత కార్మికులకు ఉపాధి లేకుండా పోయిందన్నారు. ఏటా జనవరిలో వచ్చే ఆర్డర్ ఏప్రిల్ వచ్చినా రాకపోవడంతో కార్మికులు ఆదాయం కోల్పోతు న్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులకు యూనిఫామ్ కుట్టే ఆర్డర్లను ప్రైవేట్ సంస్థలకు కట్టబెట్టే ఆలోచనను ప్రభుత్వం విరమించు కోవాలని కోరారు. ఇప్పటికే రాష్ట్రంలోని 393 చేనేత సహకార సంఘాల్లో కార్మికులకు సరైన పని లేక ఆందోళన చెందుతుండగా, ప్రభుత్వం సైతం ఇచ్చే ఆర్డర్లను విరమించుకోవడం దారుణమని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచిం చి టెస్కోకు ఆర్డర్లు ఇచ్చేలా నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వంలోని వివిధ శాఖల నుంచి వచ్చే ఆర్డర్లను చేనేత సంఘాలకు అప్పగించి వారి ఆర్థిక పురోగా అభివృద్ధికి సహకరించాలని కోరారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి పేదల పాలిట వరం



### సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి

### డిసిసి ప్రధాన కార్యదర్శి గుత్త ఉమా ప్రేమ్ చందర్ రెడ్డి

**సంస్థాన్ నారాయణపురం, ఏప్రిల్ 03(క్రైమ్ మిర్రర్):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి సహకారంతో మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు లబ్ధిదారులకు పంపిణీ చేసిన సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి,డిసిసి ప్రధాన కార్యదర్శి గుత్త ఉమా ప్రేమ్ చందర్ రెడ్డి. సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ పొందిన లబ్ధిదారులు బద్దం వంశీ- 60,000, జక్కిడి సత్తెమ్మ-60,000,నూకం గాలయ్య 60,000,ఉప్పర మౌని కృష్ణ 60,000, ఏనుగు లాలయ్య 60,000, వినుకొండ భీష్మాచారి 52,500, దాచేపల్లి భారతమ్మ 44,000, మేకల శంకరయ్య 31,000 దుర్గం లింగస్వామి 25,000, వందనపు కరుణ శ్రీ 28,000, వందనపు రమేష్ బాబు 16,000 కరంటోతు శ్రీకాంత్ 36,000,నేర్లకంటి లక్ష్మమ్మ 20,000,బద్దం యాదగిరి18,000, చిలువేరు శివకుమార్ 24,000, ఏపూరి ముత్తమ్మ 17,000 సంగిశెట్టి తిరుమలేష్ 9000 చెక్కులను పొందారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొండ్రెడ్డి నరసింహ, ఉప సర్పంచ్ పల్లె మల్లారెడ్డి, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు జక్కిడి చంద్రారెడ్డి, వార్డు మెంబర్లు సూరపల్లి వెంకటేష్, మందుగుల బాలకృష్ణ, పందుల యాదగిరి గౌడ్, చిలివేరు రమాదేవి శంకర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చిలువేరు పాల అంజయ్య, రహీం షరీఫ్, పిఎసిఎస్ మాజీ డైరెక్టర్ ఉప్పల కృష్ణ, బద్దం గిరి, రిపోర్టర్ సింగం కృష్ణ మహమ్మద్ అర్షద్, బానోతు కిరణ్, బద్దుల యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.



## దొడ్డి కొమరయ్య ఆశయాలను కొనసాగించాలి

**క్రైమ్ మిర్రర్ వలిగొండ:** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో దొడ్డి కొమరయ్య కురుమ 99 వ జయంతిని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పట్టణ, మండల కురుమ కులస్థులు మరియు బీసీ సంఘాల నాయకులు పాల్గొని దొడ్డి కొమరయ్య ఆశయాలుసాధించాలని మరియు కురుమ కులస్థులుసంఘటితంగా ఉండిరాజకీయంగా ఎదగాలని,మన హక్కులుకాపాడుకోవాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో రేగు బీరప్ప,ఈతప రాములు,ఈతప నరసింహా,ఎమ్మె మల్లేష్ కంకల కిష్టయ్య,బీసీ నాయకులు సాయిని యాదగిరి,రామచంద్రు,మల్గ నాగులు,కొక్కల శ్రీనివాస్,మోటె సత్యనారాయణ,రేగు శ్రీధర్,ఉలిపే పాండు, రేగు మల్లికార్జున్,కౌడె కృష్ణ,ఎమ్మె లింగస్వామి,మల్గ నరేష్,ఈతప నరేశ్, కౌడె నరేష్,మోటే సాయి,ఉలిపే లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

## సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక మురుగు నీరంతా రోడ్లపైనే





**గండిపేట(క్రైం మిర్రర్):** సరైన డ్రైనేజీ వ్యవస్థ లేని కారణంగా మురుగు నీరంతా రోడ్లపైనే పారుతుందని ఈ దుర్గంధభరితమైన వాతావరణంలో జీవించలేకపోతున్నామని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మైలార్దేవ్పల్లి డివిజన్ టీఎన్జీవోస్ కాలనీ లో డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా అధ్వానంగా మారింది. వారానికి మూడు రోజులు నిండిపోయి ఉంటుంది. డ్రైనేజీ బయటకు రావడం వల్ల ఇక్కడ వాసవి టెంపుల్, అయ్యప్ప దేవాలయానికి వెళ్లే వారికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ప్లాట్ నెంబర్ 165, 166, ప్లాట్ నెంబర్ 160, 159లో ఈ రెండు కూడా చాలా కమర్షియల్ బిల్డింగ్ డ్రైనేజీ లైన్ సివరేజ్ లైన్ లేక మురుగు నీరు పారుతుందన్నారు. వాటర్ డిపార్ట్మెంట్ అధికారులు వారానికి రెండుసార్లు క్లీన్ చేయడం జరుగుతుందని అయినా సమస్య పరిష్కారం కావడం లేదన్నారు. పనులు చేసి వెళ్లిపోయిన మరుసటి రోజే యధావిధిగా డ్రైనేజీ నీరు పొంగిపోర్లుతున్నాయన్నారు. ఈ బిల్డింగ్స్ సంబంధించిన ఓనర్స్కు చెబితే పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒక బిల్డింగ్లో కమర్షియల్ హోటల్ కూడా ఉండడం కూడా చాలా ప్రాబ్లం అవుతుందని తెలుపుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# తెలంగాణ ఉద్యమ జ్వాల దొడ్డి కొమరయ్య

## భారతీయ జనతా పార్టీ నేలకొండపల్లి మండల అధ్యక్షులు పాగర్తి సుధాకర్



**క్రైమ్ మిర్రర్ ఖమ్మం ప్రతినిధి :** నేలకొండపల్లితెలంగాణ తొలి ఉద్యమకారుడు దొడ్డి కొమరయ్య గారి జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాల వేసి ఘనమైన నివాళులు అర్పించడం జరిగింది ఈ సందర్భంగా పాగర్తి సుధాకర్ మాట్లాడుతూ ఆధిపత్యానికి, అహంకారానికి, వెట్టిచాకిరికి వ్యతిరేకంగా జరిగిన 'తెలంగాణ సాయుధ పోరాటం' మిగతా ప్రపంచ పోరాటాల కంటే భిన్నమైనది. చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగినది. ఈ స్ఫూర్తే నియంత పోకడలను నిలువరించడానికి అవసరమైన భావజాలాన్ని అందించింది. అన్యాయం శృతి మించితే ఆయుధాలను ఎత్తించి, ధిక్కార స్వరాలై నిలదీసేలా చేసింది. నిజాం నిరంకుశ పాలనకు, దొరల పెత్తందారీ విధానానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటంతో ఈ ప్రాంతాన్ని ఆక్రమించుకోవాలనుకున్న మిలిటరీ పాలనకు ఎదురొడ్డి 4000 మంది కార్యకర్తలు అమరులైనారని అన్నారు,ఆ కోవలో అమరుడై, తెలంగాణ సాయుధ పోరాటానికి తొలి అమరత్వాన్ని ఇచ్చి స్ఫూర్తినిచ్చినవారే దొడ్డి కొమురయ్య అని అన్నారు,భూ సమస్యలపై దేశ వ్యాప్తంగా చర్చ జరిగే విధంగా చేసింది. తెలంగాణ ప్రజలను చైతన్య పరిచింది. బాంచెన్ దొరా నీ కాళ్లు మొక్కుతా అన్న బడుగు వారి చేత ఆయుధాలు పట్టించిం, అప్పటి నల్లగొండ జిల్లా జనగామ తాలూకాలోని విస్నూరు గ్రామంలో రాక్షతత్వానికి నిలువెత్తు నిదర్శనం అయినా విస్నూర్ దేశ్‌ముఖ్ రామచంద్రారెడ్డి, అతని కొడుకు బాబుదొర వీరి ఆగడాలు అంతాఇంతా కాదనీ,60 గ్రామాలకు అధిపతి ఈ నరరూప రాక్షసుడు నిజాంకు తొత్తులుగా ఉన్న దొరలు, పటేళ్లు, పట్వారీలు గ్రామాల్లో ప్రజలపై చేయని అఘాయిత్యం లేదనీ ,విస్నూరు దగ్గరలో ఉన్న కడవెండి గ్రామాల రామచంద్రారెడ్డి తల్లి జానమ్మ జాగీర్దార్ కడవెండి ఊరులో దొరసాని చేసిన ఆగడాలు తక్కువ ఏమి కాదనీ , చరిత్ర చెపుతుందని ,20 ఎకరాలు కూడా లేని జానమ్మ దొరసాని అనతికాలంలో ఊరును అంత తన గుప్పిట్లో పెట్టుకొని,జానమ్మ దొరసాని ప్రజల చేత దొర అని పిలిపించుకునేది. ఈ అణచివేత నుండి 1944 ఆంధ్ర మహాసభ ఏర్పాటు, తెలంగాణ ప్రాంతం అంతా ఆంధ్ర మహాసభ నాయకత్వంలో సంఘాన్ని ఏర్పరుచుకొని ,సంఘం అండతో గ్రామాల్లో ప్రజలు వెట్టిచాకిరి రద్దు కోసం ఉద్యమబాట పట్టారనీ, పన్నులు కట్టేది లేదని తిరుగుబాటు చేశారనీ,ఇది చూసిన దొరలు ఉద్యమాన్ని అణచడం కోసం అనేక ప్రయత్నాలు చేసే వారు. దొడ్డి కొమురయ్య, అన్న దొడ్డి మల్లయ్య గ్రామంలో గొల్ల, కురుమల నాయకుడు. దొరసాని వెట్టికి గొర్రెలను ఇవ్వద్దని గొర్ల కాపర్లను చైతన్యపరిచాడు. దొడ్డి మల్లయ్యతో పాటు అదే గ్రామానికి చెందిన మంగలి కొండయ్య, నరసయ్య ఎర్రం రెడ్డి మోహన్ రెడ్డి, నల్ల నరసింహులు అప్పుడున్న సంఘంలో చేరి గ్రామ నాయకులు అయినారు. ఇది మింగుడుపడని జానమ్మ దొరసాని వీళ్లను హతమార్చాలని పన్నాగం పన్నింది. దొరసాని ఆగడాలకు వ్యతిరేకంగా ప్రజలు అంతా నిరసన ప్రదర్శన చేయాలని సంఘం నిర్ణయించింది. సాయుధ పోరాట వేగుచుక్క సంఘం పిలుపు అందుకొని కడవెండి గ్రామంలో ప్రజలు అంతా వీధుల గుండా ప్రదర్శన చేశారు. అప్పటికి దొరసానికి అండగా వచ్చిన విస్నూరు రామచంద్రారెడ్డి రౌడీలు కోడూరు దొర నరసింహారెడ్డి నాయకత్వం గడి నుండి ఎలాంటి హెచ్చరికలు లేకుండా కాల్పులు జరిపారు. కడుపులోకి తూట దిగడంతో కొమురయ్య అక్కడికక్కడే నేలకొరిగాడు. కొమురయ్య అన్న మల్లయ్య కాలుకు తూట దూసుకుపోయింది. లక్ష్మీనరసయ్య కొండయ్యలకు గాయాలయ్యాయి. కొమురయ్య మరణం చుట్టు పక్కల గ్రామాల ప్రజల్లో ఆగ్రహాన్ని రగిల్చింది. వేలాది మంది ప్రజలు ఎక్కడికక్కడ సంఘం అండతో గ్రామాలలో దొర గూండాలను తరిమికొట్టారు. కొమురయ్య బలి దానం తెలంగాణ సాయుధ పోరాటానికి పురుడు పోసింది. సంఘం పిలుపుతో ప్రజలు సాయుధ మార్గం పట్టారు. కొన్ని ప్రాంతాలకు దేశ్‌ముఖ్‌లు ఉంటూ ప్రజలను రాచి రంపాన పెట్టినా దొరలను, వారి ఆధిపత్యాన్ని కూలదోశారనీ అన్నారు ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి మల్లెబోయిన గోవిందరావు మండల నాయకులు పుట్టా సత్యనారాయణ,సయ్యద్ మోహినుద్దీన్, కళ్యాణం నాగేశ్వరరావు, బానోతు శ్రీనివాసరావు, మూడు రమేష్ తదితరులు పాల్గొనడం జరిగింది

# ఆస్బెస్టాస్ కాలనీలో మానవత్వానికి నిలువెత్తు ఉదాహరణ

## ఓ వృద్ధ మహిళ కు సహాయం చేసిన సామాజిక కార్యకర్త పొన్నాల నాగరాజ్

**కూకట్ పల్లి, ఏప్రిల్ 03 (క్రైమ్ మిర్రర్) :** శేర్లింగంపల్లి నియోజక వర్గం, వెంకటేశ్వర నగర్ డివిజన్ పరిధిలోని ఆస్బెస్టాస్ కాలనీ ఎల్లమ్మ పోచమ్మ ఆలయం పరిసరాల్లో గత 15 రోజులుగా ఓ వృద్ధ మహిళ తీవ్ర కష్టాల్లో జీవిస్తున్న సంఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది. ఓం వృద్ధ మహిళ ఎలాంటి ఆహారం లేకుండా కేవలం నీళ్లు మాత్రమే తాగుతూ బతుకుతున్న పరిస్థితి అక్కడి ప్రజలను కలచివేసింది. ఈ విషయం తెలుసు కున్న సామాజిక కార్యకర్త పొన్నాల నాగరాజ్ వెంటనే స్పందించి ఈ మేరకు ఆమెతో మాట్లాడేందుకు ప్రయత్నించగా ఆమెకు కొంత మతి స్థిమితం సరిగా లేకపోవడంతో వివరాలు చెప్పలేక పోయింది. పరిస్థితి తీవ్రంగా ఉండటంతో ఆలస్యం చేయకుండా జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించి, ఆమె ఫోటోలు పంపించారు. పోలీసుల సహకారంతో ఆమెపై ఎలాంటి మిస్సింగ్ కంప్లైంట్ ఉందో పరిశీలించగా, కుటుంబ సభ్యుల వివరాలు లభించాయి. విచారణలో ఆమె శ్రీనివాస్ నగర్, ఎన్టీఆర్ నగర్ ప్రాంతంలో తన అక్క-బావ ఇంట్లో ఉండేదని తెలిసింది. తదుపరి జగద్గిరిగుట్ట మాజీ కార్పొరేటర్ జగన్ ను సంప్రదించి, వారి సహకారంతో వృద్ధ మహిళ ను సురక్షితంగా కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆమె స్వగ్రామం జనగాం సమీపంలోని పాశరమట్ల గ్రామం కాగా, మున్నూరు కాపు కడారు కుటుంబానికి చెందినదిగా గుర్తించారు. ఈ ఘటనలో సామాజిక బాధ్యతను ప్రదర్శించిన పొన్నాల నాగరాజ్ ను స్థానికులు ప్రశంసిస్తున్నారు. సమయానికి స్పందించి ఒక ప్రాణాన్ని కాపాడిన ఈ చర్య అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది.






# పార్టీ కోసం పనిచేసే ప్రతి ఒక్కరికి గుర్తింపు లభిస్తుంది... పదవులు దక్కుతాయి

## టిపిసిసి ఉపాధ్యక్షుడు,, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్



**కూకట్ పల్లి, ఏప్రిల్ 03 (క్రైమ్ మిర్రర్) :** పార్టీ తల్లి లాంటిదని పార్టీ కంటే వేరే ఎవరు ఎక్కువ కాదని పార్టీ అభివృద్ధి కోసం పని చేస్తే వ్యక్తిగత అభివృద్ధి కూడా సాధ్యమని టిపిసిసి ఉపాధ్యక్షుడు,, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీలో కూకట్ పల్లి నియోజకవర్గం స్థాయిలో వివిధ స్థాయిలో పదవులు పొందిన 11 మంది నాయకులతో పాటు వివిధ పదవుల్లో ఉన్న సీనియర్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన శుక్రవారం నియోజకవర్గం పార్టీ కార్యాలయంలో సమావేశం అయ్యారు. వారిని శాలువాలతో సన్మానించి అభినందించి వారికి బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ జిల్లా పార్టీ పదవుల్లో నియామకం కోసం నియోజకవర్గంలో కులాలు, మతాలు, సీనియారిటీ, సిన్సియారిటీ హానెస్టీ వంటి ఎన్నో గుణగణాలను పరిగణలోకి తీసుకొని పదవులు ఇవ్వడం జరిగిందన్నారు. పార్టీ తీవ్రకష్టకాలంలో ఉన్నప్పుడు కూడా పార్టీని విడవకుండా పార్టీ కోసం కష్టపడి నాటి అధికార పక్షాన ఎదిరించి నిలబడి కేసులను తట్టుకొని పోరాటం చేసిన వారిని పార్టీ తప్పకుండా గుర్తుపెట్టుకుంటుందన్నారు. పదవులు పొందిన వారు సైతం భవిష్యత్తు లో పార్టీ కోసం సైనికుల మాదిరి కష్టపడి పని చేయాలని సూచించారు .ఇదే తరహాలో మన నాయకుల పనితీరు కొనసాగితే రానున్న జిహెచ్ఎంసి ఎన్నికల్లో అన్ని డివిజన్లను పార్టీ గెలిచి తీరుతుంది అన్నారు. పార్టీ ఉపాధ్యక్షుడిగా, నియోజకవర్గ ఇన్చార్జిగా అందర్నీ సమన్వయం చేస్తూ పార్టీ అభివృద్ధికి ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుంటానని అందరికీ అందుబాటులో ఉంటానని ఆయన హామీ ఇచ్చారు.

# జూనియర్ సివిల్ జడ్జిగా కలువల సుకన్య

**క్యాతనపల్లి, ఏప్రిల్ 3(క్రైమ్ మిర్రర్):** రామకృష్ణాపూర్ పట్టణానికి చెందిన కలువల సుకన్య జూనియర్ సివిల్ జడ్జి పదవికి ఎంపికయ్యారు. తాజాగా విడుదలైన ఫలితాల్లో ఆమె ప్రతిభ కనబరచి ఈ విజయాన్ని సాధించారు.క్యాతనపల్లి మున్సిపాలిటీ 13వ వార్డు రాంనగర్‌కు చెందిన కలువల నిర్మల,రమేష్ దంపతుల చిన్న కుమార్తె సుకన్య. సాధారణ కుటుంబానికి చెందిన ఆమె కష్టపడి చదివి న్యాయశాఖలో ఉన్నత స్థానం సాధించడం విశేషంగా నిలిచింది.సుకన్య సాధించిన విజయంపై స్థానికంగా ఆనందం వ్యక్తమవుతోంది. ఆమె తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తూ, పట్టుదలతో కృషి చేస్తే లక్ష్యాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు.యువతకు సుకన్య విజయం ఆదర్శంగా నిలుస్తోందని పలువురు అభిప్రాయపడ్డారు.



# నకిలీ దస్తావేజులు సృష్టించిన ఇద్దరి అరెస్ట్?

**గండిపేట(క్రైం మిర్రర్):** నకిలీ దస్తావేజులు సృష్టించిన ఇద్దరిని నార్సింగి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ జి.హరికృష్ణరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం నార్సింగి పరిధిలో ఉన్న బృందావన్ కాలనీలోని భూములకు సంబంధించిన అర్బన్ ల్యాండ్ సీలింగ్ అథారిటీ, లేట్ పి.వి.కుటుంబరావు వారసుల మధ్య హైకోర్టులో వివిధ సివిల్ వివాదాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో ఆ భూములలో చాలా భాగంగా ఖాళీగా ఉండటాన్ని గమనించిన కొంత మంది వ్యక్తులు 1960-1970లలో లేట్ పి.వి.కుటుంబరావు, వారి కుటుంబ సభ్యులు ఆ భూములను విక్రయించినట్లుగా నకిలీ పత్రాలను సృష్టించి వాటిని అసలైనవిగా నమ్మిస్తూ బ్రోకర్లు, ఏజెంట్ల ద్వారా అమాయక ప్రజల నుంచి భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేసి మోసం చేస్తున్నారన్నారు. ఈ విషయంలో ఇప్పటికే నార్సింగి పోలీస్టేషన్‌లో నమోదు చేసిన 20 కేసులలో సుమారు 30 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. అలాగే గురువారం నార్సింగిలోని బృందావన్ కాలనీలో సర్వే నెంబర్ 146లోని ప్లాట్ నెంబర్ 30,31,32,33లకు చెందిన మొత్తం 2 వేల గజాల భూమిని, లేట్ అన్నపూర్ణమ్మ కూర రంగారెడ్డికి అమ్మినట్లుగా నకిలీ డాక్యుమెంట్ సృష్టించి ఆ ప్లాట్లను కబ్జా చేసేందుకు వెళ్లిన వ్యక్తులపై కుటుంబరావు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నకిలీ పత్రాలను సృష్టించిన కూర సమ్మోహన్‌రెడ్డి, రాజేంద్రచారిలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. నార్సింగి బృందావన్ కాలనీలో ఏమైనా భూములు కొంటున్నట్లయితే ఒకటికి రెండుసార్లు జాగ్రత్తగా డాక్యుమెంట్లపై న్యాయ సలహా తీసుకోని కొనుగోలు చేసుకోవాలన్నారు. రిజిస్టేషన్ డాక్యుమెంట్లు, పూర్వపు లావాదేవీలు పరిశీలించాలన్నారు. అలాగే రిజిస్టేషన్ డిపార్ట్?మెంట్ వారిని కలిసి ఆ డాక్యుమెంట్స్? సరైనవ, కావా అని నిర్ధారించుకున్న తర్వాతనే కొనుగోలు ప్రక్రియ మొదలు పెట్టాలన్నారు. పాత తేదీలతో(1960-1970) ఉన్న డాక్యుమెంట్లు ఉంటే ప్రత్యేక జాగ్రత్త వహించాలన్నారు. అలాగే తక్కువ ధరకు అమ్ముతున్నామంటే అనుమాన పడాలన్నారు. ఈ నకిలీ డాక్యుమెంట్లకు సంబంధించిన ఏవైనా మీ దృష్టికి వచ్చిన లేదా నకిలీ డాక్యుమెంట్లను ఉపయోగించి మిమ్మల్ని ఎవరైనా మోసం చేసి డబ్బులు తీసుకున్న నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

# స్థానిక నయా నగర్ బాప్టిస్ట్ చర్చిలో ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు



**కోదాడ మార్చి 03 ( క్రైమ్ మిర్రర్ ):** కోదాడ: స్థానిక న్యాయ నగర్ బాప్టిస్ట్ చర్చిలో గుడ్ ఫ్రైడే వేడుకలు పాస్టర్ యేసయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కోదాడ మున్సిపాలిటీ చైర్మన్ శ్రీమతి ఎర్నేని కుసుమ బాబు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేస్తూ క్రైస్తవులకు అన్ని విధాల సహకరిస్తామని హామీ ఇచ్చారు వైస్ చైర్మన్ దేవరపల్లి మల్లేశ్వరి జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు 14 వ వార్డు కౌన్సిలర్ కందుల కోటేశ్వరరావు 13వ వార్డు కౌన్సిలర్ మోదీ గురమ్మ సైదుబాబు పాల్గొని వచ్చిన భక్తులందరికీ గుడ్ ఫ్రైడే శుభాకాంక్షలు తెలియజేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఏసు ప్రభు సిలువలో పలికిన ఏడు మాటలు ఏడుగురు వక్తలు ధ్యానం చేశారు వారు మోజస్ స్రవంతి, శార, యాతాకుల జ్యోతి కవిత భాగ్యశ్రీ మెరీనారాణి ఏసుప్రభు వారి పలికిన మాటలు మాట్లాడి క్రీస్తు ప్రేమను తెలియజేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో బొల్లి కొండ కోటయ్య బానోతు జగ్గు నాయక్, జాన్ హెడ్ కానిస్టేబుల్ సోమ పంగు నాగేశ్వరరావు శ్రవణ్ యాతాకుల మధుబాబు తదితరులు పాల్గొన్నారు

# పితృ వాక్య పరిపాలుడు శ్రీ రాముడు...భక్తిని మించిన అస్త్రం లేదని నిరూపించిన హనుమాన్

## టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్



**కూకట్ పల్లి, ఏప్రిల్ 03 (క్రైమ్ మిర్రర్) :** హనుమాన్ జయంతి సందర్భంగా కూకట్ పల్లి నియోజకవర్గం లో గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. ప్రతి కాలనీలోను హనుమాన్ శోభాయాత్రను భక్తులు ఘనంగా నిర్వహించారు. కెపిహెచ్బి కాలనీ రమ్య గ్రౌండ్ వద్ద రామసేన కల్చరల్ అసోసియేషన్ ప్రతినిధి ప్రీతం రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శోభా యాత్రకు టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తండ్రి మాటని జవదాటని శ్రీరాముడు పితృ వాక్య పరిపాలకుడు అని అలాంటి రాముడి సేవకుడిగా హనుమంతుడి సేవలు అందరికీ అనుసరణీయ మనీ ఈ సందర్భంగా రమేష్ పేర్కొన్నారు. నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో గాలి బాలాజీ ,సాయిబాబా చౌదరి, అరవింద్ రెడ్డి, రంగమోహన్, శ్రీనివాస్ బాబు, చావా శ్రీనివాస్, గంధం రాజు, గోపాల్ చౌదరి, ఫణిందర్, వినోద్ పాల్గొన్నారు.

# సనత్‌నగర్ క్రిస్టియన్ యూత్ ఆధ్వర్యంలో గుడ్ ఫ్రైడే క్రాస్ ర్యాలీ




**బాలానగర్, ఏప్రిల్ 03 (క్రైమ్ మిర్రర్) :** లోక రక్షకుడు ఏసుక్రీస్తు సిలువ మరణాన్ని స్మరిస్తూ సనత్‌నగర్ నియోజకవర్గంలో 'గుడ్ ఫ్రైడే' వేడుకలను క్రైస్తవులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా సనత్‌నగర్ క్రిస్టియన్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రాస్ ర్యాలీ (సిలువ యాత్ర) స్థానికులందరినీ ఆలోచింపజేసింది. స్థానిక ఇమ్మానుయేల్ ఎం.బి. చర్చి నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీని పాస్టర్ రెవ. ఎ. శ్రీనివాస్ ప్రత్యేక ప్రార్థనలు చేసి ప్రారంభించారు. ఏసుక్రీస్తు తన మరణం ద్వారా మానవాళికి అందించిన త్యాగాన్ని, ఆయన పడిన శ్రమలను గుర్తుచేస్తూ భక్తులు నిశ్శబ్దంగా, భక్తి భావంతో ఆధ్యాత్మికంగా పురవీధుల గుండా సాగారు. ఏసుక్రీస్తు సిలువను మోస్తున్న దృశ్యాలు, ఆయన కష్టాలను ప్రతిబింబించే కథాంశాలు ఈ ర్యాలీలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా రెవ. ఎ. శ్రీనివాస్ మాట్లాడుతూ మానవాళి మనుగడ కోసం, పాప విముక్తి కోసం ఏసుక్రీస్తు తన ప్రాణాలను బలి ఇచ్చారు. ఆయన చూపిన ప్రేమ, దయ, కరుణ, క్షమాగుణం నేటి సమాజానికి ఎంతో అవసరం. క్రీస్తు మార్గంలో నడుస్తూ తోటివారి పట్ల జాలిని ప్రదర్శించడమే మనం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి." ఈ కార్యక్రమంలో సనత్‌నగర్ పరిధిలోని వివిధ చర్చిల ప్రతినిధులు, క్రైస్తవ సోదరులు పెద్ద సంఖ్యలో ఐక్యంగా పాల్గొన్నారు. ముఖ్యంగా మెథడిస్ట్ చర్చ్, బాప్టిస్ట్ చర్చ్, సి.ఎస్.ఐ చర్చ్, ఇండిపెండెంట్ యునైటెడ్ చర్చ్, సియోన్ చర్చ్, బెతేల్ ప్రేయర్ హౌస్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమ నిర్వహణలో రేవ్. కె.జె. క్లైమెంట్, గేర్షోన్ ప్రకాష్, జోవార్ కెన్నెడీ, రాజగోపాల్, కె.సి. నిస్సి జోష్వా, బెంజమిన్ డబెట్టా, కె. సనీల్, బిజి విలియం తదితరులు పర్యవేక్షకులుగా వ్యవహరించి, వేడుకలు విజయవంతం కావడంలో కీలక పాత్ర పోషించారు.



## దొడ్డి కొమరయ్య జయంతిని శివాజీ మహారాజ్ వర్ధంతిని జరుపుకున్న నాయకులు

క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల:చౌడాపూర్ మండల కేంద్రంలో దొడ్డి కొమురయ్య జయంతి, అలాగే ఛత్రపతి శివాజీ మహారాజ్ వర్ధంతి నీ యువజన సంఘాల నాయకులు శుక్రవారం జరుపోవడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ సాయుదా పోరాటము రావడానికి భూమి భూక్తి విముక్తి ఉద్యమంగా మారడానికి దొడ్డి కొమరయ్య అమరత్వం ప్రదాన కారణంమని మధ్యయుగ భారతదేశ చరిత్రలో శివాజీ మహారాజ్ ప్రముఖ స్థానం వహించాడని, మొగలులను దీటుగా ఎదుర్కొని వారిపై పోరాటాన్ని సాగించిన ధీశాలి శివాజీ అని వారు అన్నారు. ఈయన పశ్చిమ భారతదేశంలోని మరాఠా రాజ్యాన్ని స్థాపించాడు. గొప్ప విజేత, మంచి పరిపాలనా దక్షుడిగా పేరొందారు. ఆత్మస్థైర్యం, పట్టుదల, ధైర్యసాహసాలతో తన అధికారాన్ని విస్తృతం చేసుకున్నాడు. శివాజీ రాజ్యం పేరు 'స్వరాజ్య'. ఈయన ప్రధాన లక్ష్యం హిందూ ధర్మ పరిరక్షణ అని మహనీయుల ఆశయలాకోసం ప్రతి ఒక్కరు ముంధుకుసాగలని కోరడం జరిగింది .ఈ కార్యక్రమములో వికారాబాద్ జిల్లా మాల మహానాడు అద్యక్షులు బి.వెంకటేష్ యువ నాయకులు రాజలింగం బోయిని బాలరాజు కుమ్మరి లక్ష్మయ్య మహేష్ మధు రవి మరియు చిన్నారులు తదితరులు పాల్గోనడం జరిగింది.

## పేదలకు అండగా సీఎం రిలీఫ్ ఫండ్

### కుల్కచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు, ముజాహిద్పూర్ గ్రామ సర్పంచ్ చంద్రభూపాల్ రావ్



**క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల:** సీఎం రిలీఫ్ ఫండ్ పేద ప్రజలకు అండగా ఉంటుందని కుల్కచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ బిఎస్ ఆంజనేయులు నిజాయితీ పూర్ గ్రామ సర్పంచ్ చంద్రభూపాల్రావు సూచించారు. వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలంలోని ముజాహిద్పూర్ గ్రామంలో బోయిని లక్ష్మి అంజయ్యకు 22000 రూపాయల చెక్కును కసాబ్ నర్సింగరావు 21000, అలాగే బంగారి సరూప నరేష్ కు 19,500 రూపాయల చెక్కులను పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి రాంమ్మోహన్ రెడ్డి ఆదేశాలతో పంపిణీ చేయడం జరిగింది. వారు హాస్పిటల్ నుండి డిశ్చార్జ్ అయిన వెంబడే చెక్కులు పంపిణీ చేసినందుకు ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డికి ధన్యవాదాలు కృతజ్ఞతలు లబ్ధిదారులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అరుణాభీమయ్య, వార్డు నంబర్ సర్దార్ కృష్ణయ్య, అంబుదాసు, చెన్నయ్య, గ్రామస్తులు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## దరిపల్లి అనంత రాములు జన్మదిన వేడుకలు



**క్రైమ్ మిర్రర్, ఆత్మకూరు(ఎం) ఏప్రిల్ 3:** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం అనంతరం గ్రామ శివారులోని వాత్సల్య గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ ఫౌండర్ స్వర్గీయ దరిపల్లి అనంత రాములు 86 వ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని వాత్సల్య గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ పాలిటెక్నిక్, ఇంజనీరింగ్, ఫార్మసీ, విభాగాలలోని అధ్యాపకులు విద్యార్థులు మరియు పూర్వ అధ్యాపకుల సమక్షంలో అంగరంగా వైభవంగా పుట్టినరోజు వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా స్వర్గీయ దరిపల్లి అనంత రాములు ఆశయాలు సాధించే దిశగా వాత్సల్య గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ చైర్మన్ దరిపల్లి నవీన్ కుమార్ మాట్లాడుతూ దరిపల్లి అనంత రాములు ఆశయాలను సాధించే దిశగా మేము ఎప్పుడూ ముందుంటామని అన్నారు. వాత్సల్య గ్రూప్ ఇన్స్టిట్యూషన్ కరస్పాండెంట్ మరియు సెక్రటరీ దరిపల్లి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ఐటిఐ,జూనియర్, డిగ్రీ,పీజీ,పాలిటెక్నిక్,ఇంజనీరింగ్,ఫార్మసీ విద్యా సంస్థలను స్థాపించి ఎన్నోవేల మంది విద్యార్థులకు మార్గదర్శకంగా నిలిచారని కొనియాడారు. ఈ సందర్భంగా పూర్వ అధ్యాపకులు కుర్ర అజయ్ కుమార్, శాతరాజుపల్లి రాములు, చిరుమర్తి గణేష్, బుగ్గ యాదగిరిలతో పాటు బత్తుల శ్రీనివాస్, వెన్ జెట్టి శేఖర్, గుబ్బల వెంకట సుధాకర్, వెంకటేష్, గోపాలకృష్ణ, చంద్రశేఖర్, విద్యార్థినీ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఎద్దు ఏడ్చిన వ్యవసాయం రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడినట్టు చరిత్రలో లేదు

### మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి, వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆనంద్



క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల: ఎద్దు ఏడ్చిన వ్యవసాయం రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడినట్లు చరిత్రలో ఎక్కడ కూడా లేదని, రైతులను ఏడిపించిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా మరి జన్మలో అధికారంలోనికి రాదని మహేశ్వరం ఎమ్మెల్యే మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి, వికారాబాద్ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ ఎద్దేవ చేశారు. వికారాబాద్ జిల్లా కాడ్లాపూర్ రాపోల్ గ్రామాలలో ఇండస్ట్రియల్ పార్క్ పేరుతో 1200 వందల ఎకరాలను దోచుకునే కుట్ర చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వనికి నిరసనగా, 11వ రోజు రిలే నిరహార దీక్ష కార్యక్రమంలో , రాపోల్ కడ్లాపూర్ గ్రామాలకు శుక్రవారం వారికి మద్దతుగా సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,మీ కోసం మేము కూడా మీ పోరాటంలో భాగమై,మీకు ఆసరాగా మద్దతుగా ఉంటాం అని ,అన్ని రకాలుగా అండగా నిలుస్తాం అని,బిఆర్ఎస్ పార్టీ కూడా అండగా ఉంటుందని వారికి భరోసా ఇచ్చారు. మీ భూములు కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకోకుండా పోరాటం చేద్దామని తెలిపిన మాజీ మంత్రి వర్యులు సబితా ఇంద్రారెడ్డి వికారాబాద్ ఎమ్మెల్యే ఆనంద్, పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి రైతులకు మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పరిగి మార్కెట్ మాజీ కమిటీ చైర్మన్ సురేందర్, మాజీ ఎంపీపీ అరవింద్ కుమార్, మాజీ జెడ్పిటిసి ప్రవీణ్ రెడ్డి, టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు జగన్, రాపోల్ కాడ్లపూర్ గ్రామ రైతులు మహిళామణులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రేమకు త్యాగానికి ప్రతీక గుడ్ ఫ్రైడే

### ఘనంగా పరిశుద్ధ మందిరాలలో ఆరాధనలు



**క్రైమ్ మిర్రర్** కుల్కచర్ల: ఏసుక్రీస్తు ప్రేమకు త్యాగానికి ప్రతీక గుడ్ ఫ్రైడే అని ఆయనను సిలువ వేసిన రోజును మంచి శుక్రవారం అని ఎల్ షాద్దాయ్ రాజనా మందిరం పాస్టర్ జి డానియల్ సూచించారు. వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలంలోని ఇప్పాయిపల్లి గ్రామంలో ఎల్ షాద్దాయ్ ప్రార్థన మందిరంలో శుక్రవారం కుల్కచర్ల ముజాహిద్పూర్ అంతారం సాల్వ్ డ్ గ్రామంలకు చెందిన ఏసుక్రీస్తు భక్తులు గుడ్ ఫ్రైడే ఆరాధనలో పాల్గొని గుడ్ ఫ్రైడే ఆరాధనలు జరిగాయి. రెవరెండ్ జి డానియల్ రాజ్ ఆధ్వర్యంలో ఇప్పాయిపల్లి గ్రామంలోని ఎల్ షాద్దాయ్ ప్రార్థన మందిరంలో ఏసుక్రీస్తు లోకంలోని ప్రతి మానవుని పాపముల గురించి ప్రాణం పెట్టాడని ఆయన ఒక దైవ కుమారుడని ఆయన యొక్క ప్రాణ త్యాగం వలన మానవాళికి పాపక్షమాపణ వచ్చిందని బోధనలు చేశారు. ఆయన యందు విశ్వాసముంచిన వారు నిత్యజీవం లభిస్తుందని వారు తెలిపారు. శుక్రవారం ఆయనను సిలువ వేయబడిన రోజుని గుడ్ ఫ్రైడే అని తిరిగి మరల ఆయన మూడవ దినమున అంటే ఆదివారం పునరుత్తానం తిరిగి లేచిన రోజును ఈస్టర్ డే ను జరుపుకుంటారు.మరల ఆయన భూలోకానికి రాబోతున్నాడని వారు బోధనలు చేశారు. శుక్రవారం మరణించి మూడవ దినము అంటే ఆదివారం తిరిగి లేచిన రోజును ఈస్టర్ అని, ఈస్టర్ను పవిత్ర దినముగా యేసు క్రీస్తును నమ్మిన భక్తులు విశ్వసించి పాటిస్తారు. ఈ కార్యక్రమంలో సంఘ విశ్వాసులు సంఘ పెద్దలు ఏసుక్రీస్తు భక్తులు తదితరులు పాల్గొన్నారు





## తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వీరుడు కామ్రేడ్ దొడ్డి కొమురయ్య జయంతి

**క్రైమ్ మిర్రర్ షాబాద్:** రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట విప్లవ వీరుడు కామ్రేడ్ దొడ్డి కొమురయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా షాబాద్ కురుమ సంఘం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమం సందర్భంగా గ్రామంలో దేశభక్తి, విప్లవోద్యమ స్ఫూర్తిని చాటేలా నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా షాబాద్ కురుమ సంఘం అధ్యక్షులు మద్దూరి పాండు మాట్లాడుతూ.... దొడ్డి కొమురయ్య తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో తొలి అమరుడిగా చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని పేర్కొన్నారు. ఆయన ఒక గొప్ప కమ్యూనిస్టు నాయకుడిగా పేద ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడారని తెలిపారు. భూమికోసం, భుక్తికోసం, పేదల విముక్తికోసం జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం దేశ చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించిందన్నారు.నిజాం రాజ్యంలో రైతులపై జరుగుతున్న అన్యాయాలకు, రజాకార్ల దౌర్జన్యాలకు, పటేల్--పట్వారీల అణచివేతకు వ్యతిరేకంగా ఎర్రజెండా నాయకత్వంలో రైతాంగం సాయుధ పోరాటం ప్రారంభమైందని గుర్తుచేశారు. ఈ పోరాటంలో సుమారు నాలుగు వేల మంది కమ్యూనిస్టు నాయకులు అమరులయ్యారని, దాదాపు మూడు వేల గ్రామాలకు విముక్తి లభించిందని తెలిపారు. అదేవిధంగా పది లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిన గొప్ప ఉద్యమంగా ఇది నిలిచిందన్నారు.దొడ్డి కొమురయ్య చేసిన త్యాగం నేటి తరాలకు ఆదర్శమని, ఆయన స్ఫూర్తితోనే విద్యార్థి, కార్మిక, రైతు ఉద్యమాలు కొనసాగుతున్నాయని చెప్పారు. విద్యార్థుల సమస్యలు, విద్యా వ్యతిరేక విధానాలపై ఎస్ఎఫ్ఐ వంటి సంఘాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటాలు కొనసాగిస్తున్నాయని వివరించారు.ఈ కార్యక్రమంలో షాబాద్ కురుమ సంఘం అధ్యక్షుడు మద్దూరి పాండు, తిమ్మారెడ్డి గూడ సర్పంచ్ గుత్తి చెన్నయ్య, రాపోలు నర్సిములు, మల్లారెడ్డి గూడ మాజీ సర్పంచ్ జంగయ్య, మద్దూరి మహేష్ తదితర నాయకులు, యువకులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం కొమురయ్య ఆశయాలను కొనసాగించాలని ప్రతిజ్ఞ చేశారు.

# ఇందిరమ్మ ఇళ్ల పేరుతో వసూళ్లు చేస్తే కఠిన చర్యలు

**ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి.. అర్హులందరికీ పారదర్శకంగా ఇళ్లు రూ.5 లక్షల సాయం- డబుల్ బెడ్ రూమ్ హామీ**

**గ్రామాల్లో తిరుగుతున్న మోసగాళ్లు, అధికారులకు ఎమ్మెల్యే ఆదేశాలు**

**గృహ నిర్మాణ శాఖ పీడీ చలపతిరావు ప్రజలు అప్రమత్తత సూచన**

**మోసానికి పాల్పడే వారిపై టోల్ ఫ్రీ 1800-599-599 కు కాల్ చేయండి**

**అమీన్పూర్, పటాన్చెరులో ఇందిరమ్మ ఇండ్ల సర్వే కొనసాగింపు**





పటాన్ చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఏప్రిల్ 03: ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యుల పేరుతో ఇళ్లు, స్థలాలు ఇప్పిస్తామని చెప్పి డబ్బులు వసూలు చేసే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం నాడు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జిల్లా గృహనిర్మాణ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరుపేదలకు సొంతింటి కలను సాకారం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్లను అందించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం సొంత స్థలం ఉన్న వారికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం, స్థలం లేని వారికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు అందిస్తున్నదని వెల్లడించారు. ఈ నేపథ్యంలో కొందరు వ్యక్తులు గ్రామాలు, పట్టణాల్లో తిరుగుతూ ఇందిరమ్మ ఇళ్ల పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నట్లు సమాచారం అందిందని పేర్కొన్నారు. ఇలాంటి అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా గృహనిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. అధికారులు సహకరిస్తే కూడా ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇదే సందర్భంగా జిల్లా గృహనిర్మాణ శాఖ పీడీ చలపతిరావు మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల పేరుతో ప్రజలను మోసం చేస్తూ డబ్బులు వసూలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ పథకాల పేరుతో ఎవరైనా డబ్బులు అడిగితే అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలకు ఏవైనా సందేహాలు ఉంటే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1800-599-599 కి కాల్ చేసి పూర్తి వివరాలు తెలుసుకోవాలని తెలిపారు. ఇలాంటి మోసగాళ్లపై వెంటనే ఫిర్యాదు చేసి, ఇతరులను కూడా అప్రమత్తం చేయాలని అధికారులు కోరారు. అమీన్పూర్, పటాన్ చెరు సర్కిళ్లలో ప్రస్తుతం సర్వే కొనసాగుతోందని, త్వరలో అర్హులైన వారికి ఇళ్లు కేటాయిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సమావేశంలో డీఈ సుజాత, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ తొలి అమరుడు దొడ్డి కొమరయ్య

**నేరేడుచర్ల లో ఘనంగా జయంతి వేడుకలు**

**దొడ్డి కొమురయ్య ఆశయ సాధనే లక్ష్యం**

**బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనుంజయ నాయుడు**



క్రైమ్ మిర్రర్ , నేరేడుచర్ల : తెలంగాణ సాయుధ పోరాటంలో నేలకొరిగిన తొలి అమరజీవి దొడ్డి కొమరయ్య అని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో దొడ్డి కొమరయ్య చిత్రపటానికి పూలమాల వేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ 1947లో భారతదేశానికి స్వాతంత్రం వచ్చినప్పటికీ వాటి నిజాం నవాబు యొక్క స్వార్థం వల్ల తెలంగాణ రాష్ట్రానికి స్వాతంత్రం రాకపోవడంతో ఆనాడు కమ్యూనిస్టు పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు జరిగిన సాయుధ పోరాటంలో నేలకొరిగి తెలంగాణ పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిచెప్పిన ఘన చరిత్ర దొడ్డి కొమరయ్యది అని ఆయన గుర్తు చేశారు. దొడ్డి కొమరయ్య పోరాట స్ఫూర్తితో నాడు నాలుగువేల మంది యువకిశోరాల ఆత్మ బలిదానంతో తెలంగాణ రాష్ట్రం భారతదేశంలో విలీనమై ఈనాడు మనమంతా భారతీయులశీ అని సగర్వంగా తలెత్తుకొని జీవించడానికి దొడ్డి కొమురయ్య చేసిన ప్రాణ త్యాగమే మూల ఆధారమని ఆయన అన్నారు. కానీ నేడు మతోన్మాదుల పరిపాలన లో భారతదేశం సార్వభౌమాధికారం తాకట్టు పెట్టబడుతోంది అని మతోన్మాదుల నుంచి దేశానికి విముక్తి కలిగించడమే దొడ్డి కొమరయ్యకు ఇచ్చే ఘన నివాళి ఆయన అన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు రాపోలు నవీన్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను ఏఐటీయూసీ మండలాధ్యక్షుడు ఊదర వెంకన్న బీసీ హక్కుల సాధన సమితి జిల్లా సహాయ కార్యదర్శి కొమ్రాజు వెంకట్, బీసీ హక్కుల సాధన సమితి పట్టణ అధ్యక్షుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్ కడమంచి సైదులు ,యర్రమాద శేఖర్ రమేష్ ,శ్రీరాములు పాల్గొన్నారు.

# విలీన గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**అమీన్పూర్ పరిధిలో ఎమ్మెల్యే జీఎంఆర్ పర్యటన**

**పెండింగ్ పనులపై సమీక్ష-అధికారులకు ఆదేశాలు**


**పాఠశాల భవన పనుల ఆలస్యంపై ఆగ్రహం**

**సుల్తాన్పూర్‌లో రూ.1 కోటి తో స్కూల్ భవనం నిర్మాణం**

**వడకపల్లిలో రూ.9.80 కోట్లతో రాక్ పార్క్..**

**కోట అభివృద్ధికి హెచ్ఎండిఏ నిధులు కొత్త డివిజన్ల ఏర్పాటు ప్రతిపాదన**

**సిఎస్ఆర్ నిధులతో అభివృద్ధి వేగం దయారలో యూత్ బిల్డింగ్ శంకుస్థాపన**



పటాన్ చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఏప్రిల్ 03: అమీన్పూర్ డివిజన్ పరిధిలోని విలీన గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నట్లు పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఉదయం అమీన్పూర్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్, ఇంజనీరింగ్ ఈఈ సురేష్ తదితరులతో కలిసి వడకపల్లి, కిష్టారెడ్డిపేట, ఐలాపూర్, సుల్తాన్పూర్, దయార, పటేల్ గూడ, ఐలాపూర్ తండా, జానకంపేట గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పెండింగ్ అభివృద్ధి పనులు, కొత్తగా చేపట్టబోయే పనులపై సమీక్ష సమావేశం నిర్వహించి, ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. కిష్టారెడ్డిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవన నిర్మాణం నత్తనడకన సాగుతుండటంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే పనులు పూర్తి చేయాలని సూచించారు. వడకపల్లి గ్రామంలో పురాతన కోట అభివృద్ధికి హెచ్ఎండిఏ ద్వారా రూ.9.80 కోట్లతో రాక్ పార్క్ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. పూర్తి సర్వే అనంతరం త్వరలోనే శంకుస్థాపన చేస్తామని పేర్కొన్నారు. సుల్తాన్పూర్‌లో మోల్డ్ టెక్ సంస్థ సహకారంతో రూ.1 కోటి వ్యయంతో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా, గ్రామంలో కొత్తగా నిర్మించిన ఫంక్షన్ హాల్, మల్లన్న దేవాలయాన్ని త్వరలో ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. అమీన్పూర్, పటాన్చెరు సర్కిళ్లలో జనాభాకు అనుగుణంగా మరో ఐదు డివిజన్ల ఏర్పాటు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ప్రభుత్వ నిధులతో పాటు సిఎస్ఆర్ నిధులను వినియోగించి అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తామని చెప్పారు. అనంతరం దయార గ్రామంలో యూత్ బిల్డింగ్ నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, స్థానిక నాయకులు మరియు అధికారులు పాల్గొన్నారు.





## పట్టణ కురుమ సంఘం ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య 99వ జయంతి

**క్రైమ్ మిర్రర్, ఆత్మకూరు(ఎం) ఏప్రిల్ 3:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండల మరియు పట్టణ కురుమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం రోజున దొడ్డి కొమురయ్య 99వ జయంతిని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలేరు మున్సిపల్ చైర్మన్ బీజన బాలమణి భాస్కర్,మండల కురుమ సంఘం అధ్యక్షులు బండ పర్వతాలు,పట్టణ అధ్యక్షులు యగ్గి శ్రీశైలం,మండల పట్టణ కురుమ సంఘం పెద్దలు అందరూ హాజరై ఘనంగా దొడ్డి కొమురయ్యకి ఘనంగా పూలమాలలు వేసి సత్కరించడం జరిగింది.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ



**సంస్థాన్ నారాయణపురం, ఏప్రిల్ 03(క్రైమ్ మిర్రర్):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం శేరిగూడెం గ్రామంలో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి సహకారంతో మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును గ్రామ సర్పంచ్ పాలెం వీరేశం గౌడ్, మాజీ సర్పంచ్ శైలజ సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు ఈద శంకరయ్య చేతుల మీదుగా లబ్ధిదారులు గుంటోజు మౌనికకు 19500 రూపాయల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ ప్రధాన కార్యదర్శి కద్దాల కిషోర్, కద్దాల నరసింహ, శంకరయ్య, మరుదొడ్డి శ్రీనివాస్, బద్దం వెంకట్ రెడ్డి, రాచకొండ రాములు, గుంటోజు బ్రహ్మచారి గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## కొన్యాలలో ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు నిర్వహణ



**హత్నూర, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఏప్రిల్ 03:** హత్నూర మండలం కొన్యాల గ్రామంలో సి.ఎస్.ఐ చర్చి పాస్టోరెట్ ఆధ్వర్యంలో గుడ్ ఫ్రైడే వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చి దైవసేవకులు రెవరెండ్ ఎన్. అమృతయ్య ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి వాక్యోపదేశం చేశారు. క్రైస్తవ సంప్రదాయాలకు అనుగుణంగా మహిళలు, పురుషులు, యువకులు తెల్లని వస్త్రాలు ధరించి చర్చిలో పాల్గొని ప్రార్థనలు చేశారు. గుడ్ ఫ్రైడే అనేది ప్రపంచ మానవాళి పాప విమోచన కోసం యేసు క్రీస్తు సిలువపై తన ప్రాణాలను అర్పించిన దినమని రెవరెండ్ అమృతయ్య తెలిపారు. ఇది విచారకరమైన రోజు అయినప్పటికీ, క్రీస్తు త్యాగం ద్వారా మానవాళికి మోక్షం లభిస్తుందని విశ్వాసంతో ఈ దినాన్ని గౌరవంగా నిర్వహిస్తామని చెప్పారు. యేసు క్రీస్తు శారీరక, మానసిక హింసలను అనుభవించి కూడా తనను హింసించిన వారిని క్షమించి నిస్వార్థ ప్రేమకు ప్రతీకగా నిలిచారని వివరించారు. ఈ రోజు ఈస్టర్ పండుగకు ముందు వచ్చే ముఖ్యమైన శుక్రవారం అని, యేసు క్రీస్తు మరణం మరియు పునరుత్థానానికి సంబంధించిన ప్రాధాన్యతను విశ్వాసులకు వివరించారు. ఈ కార్యక్రమంలో దైవసేవకురాలు ప్రమీలమ్మ, మహిళలు, యువకులు, చిన్నపిల్లలు, సంఘ పెద్దలు పాల్గొన్నారు.









# చిరు కుమార్తెగా ఆ బ్యూటీ.. ఏంటి విషయం?

ఈ మధ్య కాలంలో అద్భుతమైన సక్సెస్ అందుకున్న సినిమా 'ధురంధర్'. గత డిసెంబరులో రిలీజైనప్పుడు ఇప్పుడు ఓటీటీలోకి వచ్చిన తర్వాత మంచి రెస్పాన్స్ అందుకుంటోంది. ఇందులో నటించిన రణ్‌వీర్ సింగ్, అక్షయ్ ఖన్నా, మాధవన్, సంజయ్ దత్, అర్జున్ రాంపాల్.. ఇలా అందరికీ మంచి పేరు వచ్చింది. హీరోయిన్‌గా చేసిన సారా అర్జున్ కూడా ఓవర్ నైట్ స్టార్‌డమ్ సొంతం చేసుకుంది. ఇప్పుడు ఈమె.. చిరంజీవి కూతురిగా నటించే బంపరాఫర్ కొట్టేసిందట. ఈ సంక్రాంతికి 'మన శంకరవరప్రసాద్' సినిమాతో హిట్ కొట్టిన చిరంజీవి.. త్వరలో 'విశ్వంభర'తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. మరోవైపు బాబీతో మరోసారి కలిసి పనిచేయనున్నాడు. గతేడాదే ఈ ప్రాజెక్టుపై ప్రకటన వచ్చింది. ఇంకొన్ని రోజుల్లో ఈ మూవీ సెట్స్‌పైకి వెళ్లనుంది. ప్రస్తుతం నటీనటుల ఎంపిక, ప్రీ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. ఇందులో భాగంగా సినిమాలో ఎవరెవరు నటిస్తారనే వివరాలు బయటకొస్తున్నాయి. ఇందులో చిరుకి జోడీ ప్రియమణిని ఎంపిక చేశారని.. మోహన్ లాల్ కీలక పాత్ర కోసం తీసుకున్నారని.. విలన్‌గా బాలీవుడ్ దర్శకనటుడు అనురాగ్ కశ్యప్ కనిపించబోతున్నారని అంటున్నారు. అలానే కీలకమైన హీరో కూతురి పాత్ర కోసం 'ధురంధర్' ఫేమ్ సారా అర్జున్‌ని ఫైనల్ చేశారని మాట్లాడుకుంటున్నారు. తొలుత ఈ పాత్ర కోసం కృతి శెట్టి పేరు కూడా వినిపించింది కానీ సారా ఫైనల్ అయినట్లు ఉంది. సారా నటించిన తొలి తెలుగు మూవీ 'యుఫోరియా'.. ఈ శుక్రవారం థియేటర్లలోకి రానుంది.

# రూ.1300 కోట్ల కలెక్షన్స్.. ఆ మూవీ నాగ్ చేయలేకపోయాడా?

మనది అని రాసుంటే ఎప్పటికైనా అది మన దగ్గరకే వస్తుంది. మనది కాకపోతే చేతుల వరకు వచ్చినా సరే దక్కకుండా చేజారిపోతుంది. ఇప్పుడు ఇదంతా ఎందుకు చెబుతున్నామంటే టాలీవుడ్ స్టార్ హీరో నాగార్జున.. ఓ అద్భుతమైన అవకాశాన్ని మిస్ చేసుకున్నారనే న్యూస్ ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. ఒకవేళ ఆ ఛాన్స్ నాగ్ అందుకుని ఉంటే ఎలా ఉండేదా అని ప్రతి ఒక్కరూ మాట్లాడుకుంటున్నారు. ఇంతకీ ఏంటి విషయం రీసెంట్ టైంలో ఊహించని సక్సెస్ అందుకున్న సినిమా 'ధురంధర్'. థియేటర్లలోకి వచ్చేంతవరకు దీనిపై పెద్దగా బజ్ లేదు. పాన్ ఇండియా రిలీజ్ కూడా కాదు. కేవలం హిందీ వెర్షన్ మాత్రమే విడుదల చేశారు. టికెట్ పెంపు లాంటివి అసలే లేవు. డిసెంబరు తొలివారంలో బిగ్ స్క్రీన్స్‌పైకి రాగా ఇప్పటికీ వసూళ్లు రాబడుతూనే ఉంది. ప్రస్తుతానికైతే రూ.1300 కోట్ల మేర వసూలు చేసింది. ఇందులో హీరో పాత్ర కంటే రహమాన్ డకాయిత్ అనే విలన్ పాత్రకు అదిరిపోయే రెస్పాన్స్ వచ్చింది.

# పార్కింగ్ డైరెక్టర్‌కు శివకార్తికేయన్ ఓకే చెప్తారా?

సినిమా ఒక మాయాజాలం. ఇక్కడ ఎవరు, ఎప్పుడు పాపులర్ అవుతారో, ఎవరు ఎవరితో కలసి చిత్రాలు చేస్తారో ఊహించలేం. ఉదాహరణకు రజనీకాంత్ 173వ చిత్రం విషయానికే వస్తే దానికి ఎవరు దర్శకత్వం వహిస్తారా అనే చర్చ జరిగింది. ధనుష్ సహా పలువురు దర్శకుల పేర్లు సామాజిక మాధ్యమాల్లో హల్ చల్ చేశాయి. అలాంటి పరిస్థితుల్లో అనూహ్యంగా దర్శకుడు సుందర్ సి పేరు ఖరారైంది. డాన్ దర్శకుడితో రజనీకాంత్ దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన కూడా వెలువడింది. అలాంటిది హఠాత్తుగా ఆయన ఆ చిత్రం నుంచి వైదొలిగారు. ఆ తరువాత పార్కింగ్ చిత్రం ఫేమ్ రామ్‌కుమార్ బాలకృష్ణన్ పేరు తెరపైకి వచ్చింది. ఆహా.. లక్కీచాన్స్ అని అందరూ అనుకున్నారు. అంతలోనే డ్రాగన్ చిత్రం ఫేమ్ అశ్వద్ మారిముత్తు పేరు వినిపించింది. అయితే తాజాగా డాన్ చిత్రం ఫేమ్ శిబి చక్రవర్తి పేరు ఖరారైంది. ఇకపోతే పార్కింగ్ చిత్రం ఫేమ్ రామ్‌కుమార్ బాలకృష్ణన్ ఏం చేస్తున్నారని ఆరా తీస్తే ఆయన ఇటీవల శివకార్తికేయన్‌కు కథ వినిపించినట్లు తెలిసింది. శివకార్తికేయన్ గ్రీన్ సిగ్నల్ ఇస్తారా? లేదా? అనేది ఇప్పుడు ఆసక్తిగా మారింది. ఆయన నటించిన పరాశక్తి చిత్రం ఈనెల 10న తెరపైకి రానుంది. తర్వాత వెంకట్ ప్రభు దర్శకత్వంలో నటించడానికి సిద్ధం అవుతున్నారు. ఒక వేళ రామ్‌కుమార్ బాలకృష్ణన్ కథకు పచ్చజెండా ఊపితే వెంకట్ ప్రభుతో మూవీ చేశాకే ఆయన చిత్రం ఉండే అవకాశం ఉంది.





# పాన్ ఇండియా మూవీలో స్పెషల్ సాంగ్.. నిజమేనా?

తెలుగులో చేసినవి రెండు మూడు సినిమాలే అయినా మృణాల్ ఠాకూర్ మంచి క్రేజ్ సొంతం చేసుకుంది. రీసెంట్ టైంలో అయితే ఈమె గురించి సోషల్ మీడియాలో చాలా రూమర్స్ వినిపించాయి. తమిళ హీరో ధనుష్‌ని పెళ్లి చేసుకోనుందని, ఫిబ్రవరి 14న డేట్ కూడా ఫిక్స్ చేశారని అన్నారు. తీరా చూస్తే ఇవన్నీ వట్టి పుకార్లు మాత్రమేనని మృణాల్ టీమ్ క్లారిటీ ఇవ్వడంతో అందరూ రిలాక్స్ అయిపోయారు. ఈ విషయాలని పక్కనబెడితే ఇప్పుడు మెగా హీరో మూవీలో ఐటమ్ సాంగ్ చేయనుందనే రూమర్ వినబడుతోంది. ప్రస్తుతం తెలుగులో అడివి శేష్ 'డకాయిట్?'లో మృణాల్ హీరోయిన్. మార్చి 19న ఈ మూవీ తెలుగు, హిందీలో రిలీజ్ కానుంది. ఫిబ్రవరిలో ఓ హిందీ సినిమాతోనూ ప్రేక్షకుల ముందుకు రానుంది. వీటితో పాటు రామ్ చరణ్ 'పెద్ది'లోనూ ఈమె స్పెషల్ సాంగ్‌లో డ్యాన్స్ చేయనుందనే పుకారు తెగ వైరల్ అవుతోంది. 'జిగేలు రాణి' టైపులో దీన్ని ప్లాన్ చేశారని అంటున్నారు. ప్రస్తుతానికి ఇది రూమర్ మాత్రమే. ఒకవేళ నిజమైతే మాత్రం అభిమానులకు పండగే! మరోవైపు 'పెద్ది' వాయిదా పడనుందనే రూమర్స్ గట్టిగా వినబడుతున్నాయి. లెక్కప్రకారం అయితే మార్చి 27న పాన్ ఇండియా రిలీజ్ ప్లాన్ చేశారు. కానీ వర్క్ పెండింగ్ ఉండటం, మార్చిలోనే 'ధురంధర్ 2' రిలీజ్ కానుండటం తదితర కారణాల వల్ల వాయిదా గ్యారంటీ అని అంటున్నారు. మే లేదా జూన్‌లో 'పెద్ది' థియేటర్లలోకి వచ్చే అవకాశముందని తెలుస్తోంది. 'పెద్ది' ఈ తేదీన రాకపోతే.. పవన్ కల్యాణ్ 'ఉస్తాద్ భగత్ సింగ్'.. ప్రేక్షకుల ముందుకు రావొచ్చనే టాక్ కూడా వినిపిస్తోంది. మరి వీటిలో ఏదేది నిజమనేది తెలియాల్సి ఉంది.



# అల్లు అర్జున్ నెక్స్ట్.. లోకేశ్ కనగరాజ్‌తోనా?



అల్లు అర్జున్ ప్రస్తుతం అట్లీతో భారీ బడ్జెట్ సినిమా చేస్తున్నాడు. దీని షూటింగ్ ఈ ఏడాది అక్టోబరు వరకు ఉండనుందని తెలుస్తోంది. అంటే థియేటర్లలోకి రావడం దాదాపు వచ్చే ఏడాదే అనమాట. సరే ఈ మూవీ సంగతి పక్కనబెడితే బన్నీ నెక్స్ట్ ఏ దర్శకుడితో పనిచేస్తాడా అనే గందరగోళం ఇంకా కొనసాగుతూనే ఉంది. ఇప్పుడు లిస్టులో మరో పేరు వచ్చింది. స్టోరీ ఏంటనేది కూడా టాక్ నడుస్తోంది. అట్లీ తర్వాత త్రివిక్రమ్‌తోనే బన్నీ కలిసి పనిచేయబోతున్నాడని కొన్నిరోజుల ముందు రూమర్స్ వచ్చాయి. గతంలో అల్లు అర్జున్ దగ్గరకు వచ్చి, ఎన్టీఆర్ దగ్గరకు వెళ్లిపోయిన 'గాడ్ ఆఫ్ వార్' అనే స్క్రిప్ట్ మళ్లీ బన్నీ దగ్గరకొచ్చిందని.. ఈ ఏడాదిలో విషయంపై క్లారిటీ రావొచ్చని కొన్ని రోజుల ముందే మాట్లాడుకున్నారు. ఇది నిజమో కాదో అనే సంగతి పక్కనబెడితే కొత్తగా లోకేశ్ కనగరాజ్ పేరు తెరపైకి వచ్చింది.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.